


SHIVA SURYA TELUGU DAILY

# శివసూర్య

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704

శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 365 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ గురువారం - 10 - సెప్టెంబర్ - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



## ఏపీ పర్యాటకానికి కొత్త జోష్..
## 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

స్కైహోప్ ఏవియేషన్, మె హెయిర్ సంస్థలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి రూ. 20 కోట్ల వ్యయం అంచనా

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు



అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్

బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్



### తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ

తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు

### స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి: జగన్



- అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు
- సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా

# హింసను ప్రేరేపిస్తూ గొడ్డలి పార్టీ
# కుట్రలకు పాల్పడుతోంది

★మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వందల కేసులు వేశారు

పోలవరాన్ని గోదాట్లో కలిపారు.. మెగా డీఎస్సీకి అడ్డుపడ్డారు

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర విభజన కన్నా ఎక్కువ నష్టం జరిగింది

★రాజకీయ కక్షతో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు

★ప్రజల మద్దతుతోనే పోలవరం, అమరావతి నిర్మాణం సాధ్యమవుతోందని ఉద్ఘాటన



అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరంలో 'మీ భూమి- మీ హక్కు' సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర విభజన నష్టాలు, గత ప్రభుత్వ తీరు, మిగతా 2 లో




### వచ్చే మార్చి నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు

- గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది
- అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం
- కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం
- గత ప్రభుత్వంలో నేరాలు ఘోరాలు చేశారు

## ఎన్నారైల అండతోనే గెలిచాం..
## చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల కృషి మరువలేనిది

- తెలుగుజాతిని ప్రపంచంలో నెం.1గా నిలిపే బాధ్యతను సమిష్టిగా తీసుకుందామని పిలుపు
- చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిరసనలకు పిలుపు
- 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టీకరణ



అమరావతి: 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ మిగతా 2 లో

## ఈ20 ఇంధనంపై
## కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన..

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

- కేంద్రానికి మద్దతు
- ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి



హైదరాబాద్: ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో మిగతా 2 లో

# "అసెంబ్లీ వద్ద ఘటన
# ఆషామాషీగా జరిగింది కాదు

అది ఫాంహౌస్ భావజాలం.. సభ్యులతో అమలు చేయిస్తున్నారు

- ఒక తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరం
- సభాపతిపై వ్యాఖ్యలు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ
- నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి
- ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ సంస్కృతి, సంస్కారం, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య



హైదరాబాద్: భారాస నాయకత్వం ఫాంహౌస్ భావజాలాన్ని సభ్యులతో అమలు చేయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందున తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని, ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మిగతా 2 లో



### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం.. వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క

- ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చారు
- కోవా లక్ష్మి, సబిత ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారు
- నవీన్ రెడ్డి నెట్టుకుంటూ పోయినప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యేలు అయ్యో అని అరిచారు

### గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ



- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా

## హింసను ప్రేరేపిస్తూ గొడ్డలి పార్టీ కుట్రలకు పాల్పడుతోంది

అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరంలో 'మీ భూమి- మీ హక్కు' సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర విభజన నష్టాలు, గత ప్రభుత్వ తీరు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా ప్రసంగించారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "రాజకీయ కక్షతో పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదాట్లో కలిపేశారు. కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉంటే 2021కి ప్రాజెక్టు పూర్తయ్యేది. ఇప్పుడు కఠిన పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టు రాష్ట్రాన్ని ఆదుకునేది. గత పాలనలో బయటకు రావాలంటే, మాట్లాడాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పేపర్లను ఎవల్యుయేషన్, డైవర్ట్ చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారు. కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు" అని ఆయన ఆరోపించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు విరుచుకుపడ్డారు. "ప్రజల సమస్యలపై చర్చించమని అసెంబ్లీకి రమ్మంటే వచ్చే ధైర్యం లేదని మొండికేస్తున్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు, ఎక్కడికి వెళ్లినా హింసే. 'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తారు. ఫ్లెక్సీలు పొట్టేళ్లను బలి ఇచ్చి హింసను ప్రేరేపిస్తారు. సామాజిక మాధ్యమాల్లో మా కుటుంబ సభ్యులపై అసభ్యంగా రాతలు రాయిస్తారు. ఒక రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. "గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాను. అలిపిరిలో నాపై క్లెమోర్ మైన్స్ పేల్చినా ప్రజల కోసమే పనిచేస్తున్నాను. మత కక్షల విషయంలో మాట వినని నా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయించిన చరిత్ర నాది. సీఎంగా నేను సమర్థవంతంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది" అని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని, దీనివల్లే రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చంద్రబాబు తెలిపారు. పోలవరం, అమరావతి నిర్మాణ పనులను తిరిగి చేపట్టగలిగామన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని, ఆ నీటితో ప్రజల ముఖాల్లో ఆనందం చూసినప్పుడు తనకు ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగిందని, 350 కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారని, సరైన ఆధారాలు లేదని కోర్టు కూడా వారిని మందలించిందని గుర్తుచేశారు. గొడ్డలి పార్టీ ఎన్ని కుట్రలు చేసినా బెదిరేది లేదని, ప్రజల కోసమే నిత్యం ఆలోచిస్తానని ఆయన స్పష్టం చేశారు. రూ. 240 కోట్ల వ్యయంతో కోనసీమలో గ్రిడ్ ఆధునీకరణ చేపట్టి 3 ఫేస్ కరెంటు అందిస్తున్నామని, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ పాలనను మెరుగుపరుస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి: జగన్

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక 'కురుక్షేత్ర సంగ్రామం' లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ కార్యకర్తలు గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే తప్ప చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనక స్థానిక ఎన్నికలను తప్పించుకునే కుట్ర ఉందని అనుమానాలు ఉన్నాయన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయంటే, ఎన్నికలు ఏ రీతిలో సజావుగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం పారదర్శక ఎన్నికలు సాధ్యం కావని... నిత్యం ఏదో ఒక డ్రామా ఆడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను లాక్కెళ్లిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు అదే 23 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. దౌర్జన్యాలు, అబద్ధాలు ఎల్లకాలం సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..
## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, వాటికి సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనపై నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..
## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

## ఏపీ పర్యాటకానికి కొత్త జోష్.. 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. రాష్ట్రంలోని కీలక పర్యాటక ప్రాంతాలను జల మార్గాల ద్వారా అనుసంధానించే సీ ప్లేన్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు స్కైహోప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలి ఎయిర్ సర్వీసెస్ (మె హెయిర్) సంస్థలు ముందుకు రాగా, కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వాటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాలను గుర్తించారు. విజయవాడ (బెర్మ్ పార్క్), శ్రీశైలం, విశాఖపట్నం, తిరుపతి (రాయలచెరువు), సూర్యలంక, గండికోట, కాకినాడ, అరకు (జోలాపుట్), లంబసింగి (తాజంగి రిజర్వాయర్), పోలవరంలలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్‌డ్రోమ్‌ల (మినీ విమానాశ్రయాలు) నిర్మాణానికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) త్వరలో టెండర్లు పిలవనుంది. ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఆపరేటర్లుగా సంస్థలు ముందుకు రావడంతో, వాటర్‌డ్రోమ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఆయా సంస్థల ప్రతినిధులు ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. గతేడాది విజయవాడలోని బెర్మ్ పార్కు నుంచి శ్రీశైలం వరకు నిర్వహించిన ట్రయల్ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సీ ప్లేన్‌లో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రయోగం కార్యరూపం దాల్చనుంది. అయితే, అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కాకుండా డిమాండ్‌ను బట్టి దశలవారీగా సేవలను ప్రారంభించనున్నారు. తొలి దశలో విజయవాడ, శ్రీశైలం, విశాఖపట్నం, లంబసింగి, సూర్యలంక, కాకినాడలో సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం 'ఉడాన్' పథకం కింద ఆర్థిక చేయూత అందించనుంది. ప్రయాణికుల నుంచి ఆదరణ పెరిగే వరకు, ఆపరేటర్లకు సంభవించే నష్టాలను భర్తీ చేసేందుకు లోటు భర్తీ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ – వీజీఎఫ్) కింద తోడ్పాటు అందిస్తుంది. రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో సీ ప్లేన్లకు మంచి ఆదరణ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే కేరళ, గుజరాత్‌లలో ఉడాన్ పథకం కింద సీ ప్లేన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు వాటి సరసన ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. ఈ వాటర్‌డ్రోమ్‌లను కేవలం సీ ప్లేన్లకే కాకుండా, ఇతర పర్యాటక బోట్ల అవసరాలకు కూడా వినియోగించుకునేలా డిజైన్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం..
## వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్: బీఆర్ఎస్ఎమ్మెల్యేలు సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలపట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనపై వీడియోను ఆమె విడుదల చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవలక్ష్మీలను వెనక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోసేయడంతోపాటు.. గంగుల కమలాకర్ మహిళా ఎమ్మెల్యేలను వెనకనుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారని తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన మంత్రి సీతక్క.. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చారని... అలా చొరబడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోవా లక్ష్మీ, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. నవీన్ రెడ్డి నెట్టుకుంటూ పోయినప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యేలు అయ్యో అని అరిచారని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలను వెనక నుంచి తోసిన గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డిలది కీచకపర్వమని విమర్శించారు.

## ఎన్నారైల అండతోనే గెలిచాం.. చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

అమరావతి: 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుజాతిని ప్రపంచ యవనికపై నంబర్ వన్ స్థానంలో నిలిపే బాధ్యతను అందరం కలిసికట్టుగా తీసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యయ్యారు. ఈ సందర్భంగా, నూతనంగా ఎన్నికైన సభ్యులతో ఎన్నారై సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా కనీసం 20 మంది తెలుగువాళ్లు మనకు కనిపిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, చదువుకున్న వారికి, మేధావులకు అవకాశాలు కల్పించారు. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో 50 శాతం స్థానాల్లో యువత గెలుపొందగా, ఏడుగురు ఎన్నారైలకు టీడీపీ అవకాశం కల్పించింది. వారిలో పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావడం మనందరికీ గర్వకారణం" అని వివరించారు.

### కష్టకాలంలో ఎన్నారైలే కొండంత బలం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. "మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్నారైలు అండగా నిలిచారు. వారిపై అక్రమ కేసులు పెట్టినా భయపడలేదు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లోని 200 నగరాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి తమ గళాన్ని వినిపించారు. ఆ సమయంలో 'మనకు ఈ రాజకీయాలు అవసరమా' అని నా భార్య బ్రహ్మణి నన్ను ప్రశ్నించింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మీరు నిర్వహించిన 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలాన్నిచ్చింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరిచింది. ఎంతోమంది ఎన్నారైలు వేల డాలర్లు ఖర్చుపెట్టుకుని ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. ఉద్యోగాలకు సెలవులు పెట్టి గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. మీ కృషితోనే ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఏర్పడింది" అని లోకేశ్ భావోద్వేగంగా ప్రసంగించారు.

### ఎన్నారైలు.. అత్యంత నమ్మకమైన భారతీయులు

ఎన్నారైలు అంటే 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్' అని అభివర్ణించిన లోకేశ్, వారు మంచి ఉద్యోగాలు చేస్తున్నా నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారని ప్రశంసించారు. "విదేశాల్లో ఉంటూ కూడా మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావంతో మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మీ నిబద్ధతకు హృదయపూర్వక నమస్కారాలు" అని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా తెలుగువారికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఉత్తరాఖండ్ వరదలు, ఉక్రెయిన్ యుద్ధం, నేపాల్ సంక్షోభం సమయంలో ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చిన ఘనత చంద్రబాబుదని తెలిపారు.

### చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు.. నిరసనకు పిలుపు

చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిందని లోకేశ్ గుర్తుచేశారు. "దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. మొదట రూ.3 వేల కోట్ల అవినీతి అన్నారు, తర్వాత రూ.300 కోట్లు, చివరికి రూ.3 కోట్లకు తగ్గించారు. కానీ ఒక్క రూపాయి అవినీతిని కూడా నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టులు క్లీన్‌చిట్ ఇచ్చాయి. ఆయన ఏ తప్పూ చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన ప్రాంతంలోనే ఆయన్ను జైల్లో నిర్బంధించారు. ఆ 53 రోజులు మనమంతా పోరాడాం. ఆ అక్రమ నిర్బంధానికి గుర్తుగా ఈ రోజు రాత్రి అందరూ తమ ఇళ్లలో 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలపాలి" అని పిలుపునిచ్చారు.

### పార్టీ బలోపేతానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

ఎన్నారైలు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, తాము పనిచేస్తున్న కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని లోకేశ్ కోరారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని, రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం ఎన్నారై సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ 'మై టీడీపీ యాప్' ద్వారా అనుసంధానం కావాలని సూచించారు. "ఏ దేశంలో పది మంది తెలుగువారు ఉన్నా అక్కడ ఎన్నారై టీడీపీ కమిటీ ఉండాలి. రాబోయే 30 రోజుల్లో కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలి. కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి" అని దిశానిర్దేశం చేశారు.

## "అసెంబ్లీ వద్ద ఘటన ఆషామాషీగా జరిగింది కాదు

మొదటి పేజి తరువాయి

నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని, ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ఉపముఖ్యమంత్రి సభలో మాట్లాడారు. "అసెంబ్లీ వద్ద ఘటన ఆషామాషీగా జరిగింది కాదు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాలున్నాయి. శాసనసభ సమావేశాలకు ముందు రోజు ఫాంహౌస్‌లో భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అక్కడి భావజాలం ఆధారంగానే కొందరు భారాస సభ్యులు ప్రవర్తించారు. గత భారాస ప్రభుత్వ హయాంలోనే సభలోకి బ్యాడ్జీలు తీసుకురావొద్దని, ప్రదర్శనాత్మక గుర్తులున్న దుస్తులు ధరించరాదని రూల్ బుక్‌లో పొందుపరిచారు. వారు రూపొందించిన నిబంధనలను అమలు చేస్తున్న సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంత వరకు సమంజసం. ఇది దళిత వర్గాలకు సంబంధించిన అంశం కాదు. తెలంగాణ సంస్కృతి, సంస్కారం, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య. ఒక తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరం. సభాపతిపై వ్యాఖ్యలు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. ఇది ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదు. మొత్తం చట్టసభకు జరిగిన అవమానం. స్పీకర్‌ను 'దళిత స్పీకర్'గా చూడటం సరికాదు. ఆయన మొత్తం శాసనసభకే సభాపతి. భారాస పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మరిచిపోలేదు. ప్రజాస్వామ్యం, తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వంపై దాడి చేసే శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భారాసను శాసనసభలోనే కాదు.. ప్రతి గ్రామంలోనూ ప్రజలు దూరంగా ఉంచాలి" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### ఆత్మగౌరవమే మా అలంకారం: మంత్రి దామోదర్

భావప్రకటన స్వేచ్ఛ అంటే ఒకరి తల్లిని అవమానించే హక్కు కాదు.. విమర్శించే హక్కు అంటే ఒకరి కులాన్ని కించపరచడం కాదని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. "రాజకీయాల్లో విమర్శలు, అభిప్రాయ భేదాలు సహజం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను అవమానించడం అత్యంత దిగజారుడుతనం. తప్పు జరిగినప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేయడం, క్షమాపణ చెప్పడం కనీస సంస్కారం. ఘటన జరిగి సుమారు 30 గంటలు గడిచినా వారిలో స్పష్టమైన పశ్చాత్తాపం కనిపించకపోవడం బాధాకరం. మాకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు. ఆత్మగౌరవంతో ఇక్కడి వరకు వచ్చాం. ఆత్మగౌరవమే మా అలంకారం. అదే మా స్ఫూర్తి" అని పేర్కొన్నారు.

స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన దూషణలను ఖండిస్తూ సభ తీర్మానం..

"శాసనసభ ప్రాంగణంలోని గేట్ నంబరు-3 సమీపంలో ఈ నెల 7న భారాస ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఇది తెలంగాణ శాసనసభ గౌరవం, హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కల్గించే చర్య. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు బాధ్యత వహించి సభ హుందాతనం పరిరక్షించేందుకు స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సభ తీర్మానిస్తోంది. అదే విధంగా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలు ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నందున తీర్మానం ప్రతిని, సభ ముందు ఉంచిన ఘటనకు సంబంధించిన ఆధారాలతో శాసనమండలి ఛైర్మన్‌కు పంపించాలని సభ తీర్మానిస్తోంది. ఈ విషయంలో నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి ఛైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలి" అని మంత్రి సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సభ తీర్మానాన్ని ఆమోదించింది. అంతకు ముందు ఈ అంశంపై సత్తుపల్లి, పాలకుర్తి ఎమ్మెల్యేలు రాగమయి, యశస్వినిరెడ్డిలు మాట్లాడుతూ మహిళా అధికారులపై దురుసుగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చొప్పదండి, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, దానం నాగేందర్ మాట్లాడారు.

## ఇరాన్‌కు అణ్వాయుధం దక్కే ఛాన్సే లేదు: ట్రంప్

ఢిల్లీ: ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సాధించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఆ దేశం అణ్వస్త్ర తయారీ దిశగా అడుగులు వేయకుండా తాము కఠిన చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఆంక్షల రూపంలో వారిని కట్టడి చేశామని ఆయన పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో మంగళవారం జరిగిన 'స్టీల్ అక్రాస్ అమెరికా' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ఒక దేశం అణ్వాయుధాన్ని సాధించాలని భావించి, ఆ లక్ష్యానికి అత్యంత చేరువగా వెళ్లింది. కానీ, ఇప్పుడు ఆ అవకాశం వారికి లేదు. వారికి అణ్వాయుధం ఎప్పటికీ దక్కదు" అని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలు అత్యంత శక్తిమంతంగా, సమర్థవంతంగా పనిచేశాయని, ఈ స్థాయిలో విజయం లభిస్తుందని ఎవరూ ఊహించలేదని ఆయన అమెరికా సైన్యాన్ని ప్రశంసించారు. సెప్టెంబర్ 11 ఉగ్రదాడుల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ దాడుల్లో అసువులు బాసిన సుమారు 3 వేల మందిని స్మరించుకుంటూ ట్రంప్ ప్రసంగం సాగింది. ఈ సందర్భంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్ సౌత్ టవర్ శిథిలాల నుంచి వెలికితీసిన 16,000 పౌండ్ల ఉక్కు దూలాన్ని ప్రదర్శించారు. ఉగ్రదాడుల సమయంలో ప్రజలను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఫైర్‌ఫైటర్ జెఫ్రీ పలాజో గౌరవార్థం.. కోస్ట్ గార్డ్‌కు చెందిన ఓ నూతన నౌకకు ఆయన పేరు పెట్టనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇదే కార్యక్రమంలో 'ది మ్యాన్ ఇన్ ది రెడ్ బందానా'గా గుర్తింపు పొందిన వెల్లెస్ క్రౌథర్‌కు మరణానంతరం అమెరికా అత్యున్నత పౌర పురస్కారం 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను అందజేశారు. ఆయన తరఫున తల్లి అలీసన్ క్రౌథర్ ఈ గౌరవాన్ని స్వీకరించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై
## మళ్లీ అఘాయిత్యాలు.. ఇద్దరి దారుణ హత్య

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్న వేళ.. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు దారుణ హత్యకు గురయ్యారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉంది. తాజా ఘటనలతో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నౌగావ్ జిల్లా మహాదేవ్‌పూర్‌లో 45 ఏళ్ల హిందూ స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తా హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి 8.30 గంటలకు మహాదేవ్‌పూర్ బజార్‌లోని తన నగల దుకాణం నుంచి ఇంటికి బయలుదేరాడు. రాత్రి 9 గంటల సమయంలో దులాల్‌పారా ప్రాంతంలోకి రాగానే కొందరు దుండగులు అతడిని అడ్డుకున్నారు. పదునైన ఆయుధంతో దాడి చేశారు. అనంతరం అతడి వద్ద ఉన్న బంగారం, 7 లక్షల బంగ్లాదేశీ టాకాలను దోచుకుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన దత్తాను కుటుంబ సభ్యులు, స్థానికులు రాజ్‌షాహీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దత్తా మృతి చెందారు. ఇది కేవలం దోపిడీ ఘటననా? మరేదైనా కక్ష ఉందా? అన్నది ఇంకా తేలలేదని మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఓసీ ఒమర్ ఫరూక్ తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. కాక్స్‌బజార్ జిల్లా మహేశ్‌ఖాలీ ఉపజిల్లాలో 45 ఏళ్ల హిందూ మహిళ రాణి సుశీల్ హత్యకు గురైంది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో హోనాక్ యూనియన్‌లోని తన ఇంట్లో ఆమె వంట చేస్తోంది. దొంగతనం కోసం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. అతడిని గమనించిన రాణి కేకలు వేయడంతో ఆమె ముఖాన్ని పట్టుకుని పలుమార్లు కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చకారియా ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనలకు కొన్ని రోజుల ముందే రంగ్‌పూర్‌లో రిటైర్డ్ హిందూ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తి, ఆయన కుటుంబంలోని మరో ముగ్గురు హత్యకు గురయ్యారు. బంగ్లాదేశ్‌లో హిందువులతో పాటు ఇతర మైనారిటీలపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో తాజా హత్యలు మరింత కలకలం రేపుతున్నాయి.

## తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల
## తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

తిరుపతి: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖరారు చేసింది. 2026 సంవత్సరానికి గాను సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఇప్పటి నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 15న సీఎం చంద్రబాబు స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పాలకమండలి సభ్యులు బుధవారం తిరుమలలో ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఈ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కూడా బ్రహ్మోత్సవాల వివరాలను పంచుకున్నారు. టీటీడీ ప్రకటనతో శ్రీవారి భక్తుల్లో బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది.

## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం
## కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

హైదరాబాద్: ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## వచ్చే మార్చి నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తాం

మాచవరం: వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధి మాచవరంలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది. ఆ అపవాదును మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. గత ప్రభుత్వంలో నేరాలు ఘోరాలు చేశారు. భూములకు భద్రత ఇవ్వడమే కూటమి ప్రభుత్వం అజెండా. పటిష్టంగా రీసర్వే చేసి.. అత్యుత్తమ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎవరూ మార్చలేరు. ఇప్పటివరకు 36 లక్షల మందికి పాస్ బుక్‌లు ఇచ్చాం... వచ్చే మార్చి లోపు 56 లక్షల మందికి అందజేస్తాం. పాలన అంటే సచివాలయంలో ఉండటం కాదు. ప్రజల వద్దకు వచ్చి కష్టసుఖాలు తెలుసుకొని పాలసీలు తెచ్చి న్యాయం చేయాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజలతో మాట్లాడేందుకే నా పర్యటనలు. పేదల సేవలో పునీతమయ్యేందుకు సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలు. ప్రజలంతా గౌరవప్రదంగా జీవించే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది. పీ4 పథకం తెచ్చి పేదలను ఆదుకునే కార్యక్రమం చేపట్టాం. పిల్లలే సంపద.. పిల్లలు లేకపోతే యంత్రాలకు సేవ చేయాల్సి వస్తుంది.

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో...
## జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు



అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే 'పాదయాత్ర 2.౦'తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

## శుభం.. సౌభాగ్యం..
## లక్ష్మీ శోభానంతో మార్మోగిన మంత్రాలయ మఠం



మంత్రాలయం, శివసూర్య: శుభం సౌభాగ్యం లక్ష్మీ శోభనంతో మంత్రాలయం శ్రీ మఠం మార్మోగింది. మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠ ప్రాంగణంలో కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు, బళ్లారి, రాయచూరు తదితర ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 2000 మంది మహిళా భజన మండలి భక్తులచే లక్ష్మీ శోభాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. లక్ష్మీదేవి ఆవిర్భావం, ఆమె కల్యాణ ఘట్టాలు, శ్రీ మహావిష్ణువుతో వైవాహిక జీవిత వైభవాన్ని వర్ణించే మంగళకరమైన గేయాల సమాహారమే లక్ష్మీ శోభానం. పూర్వకాలం నుండి వివాహం, గృహప్రవేశం వంటి ఏ శుభకార్యం చేసినా ముందుగా లక్ష్మీ శోభానం పాడటం ఆనవాయితీ. ఈ పాటలు పాడితే ఆ ఇంట్లో లక్ష్మీదేవి కొలువై సకల ఐశ్వర్యాలు, సౌభాగ్యాలు, శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా భక్తులు సంప్రదాయ పట్టు చీరలలో, నుదుటన కుంకుమ బొట్టుతో మంగళ వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యంతో శోభాన పాటలను ఆలపించారు. ఒక్కొక్కరు లక్ష్మీదేవి కీర్తనలను పాడుతుంటే మఠ ప్రాంగణం మొత్తం భక్తి భావంతో నిండిపోయింది. ఈ సందర్భంగా మఠం అధికారులు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల భక్తుల్లో భక్తి భావం పెంపొందుతుందని తెలిపారు. ఈ లక్ష్మీ శోభాన కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక భక్తులు, యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## తాగునీటి సమస్యపై
## పీఠాధిపతితో చర్చించిన టీడీపీ నేతలు, అధికారులు



మంత్రాలయం, శివసూర్య: మంత్రాలయంలోని రామచంద్ర నగర్, రాఘవేంద్రపురం కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యపై శ్రీ రాఘవేంద్ర స్వామి మఠ పీఠాధిపతి శ్రీ శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీతో మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు.




కాలనీలలో తాగునీటి సరఫరా సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వామీజీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు రామచంద్ర నగర్, రాఘవేంద్రపురం కాలనీలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను, నీటి సరఫరా అయ్యే పైప్ లైన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా రాఘవేంద్ర కూడలిలో ఉన్న అండర్ గ్రౌండ్ నీటి పైప్ లైన్ సమస్య గురించి డిప్యూటీ ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, ఏఈ తిమ్మరాజు వివరించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలనీలలో ఉన్న తాగునీటి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, ఈ విషయాన్ని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గారి దృష్టికి కూడా తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పవన్ కుమార్, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్న భీమా తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ టీడీపీ అధ్యక్షుడికి రాఘవేంద్ర రెడ్డి అభినందనలు



మంత్రాలయం, శివసూర్య: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్లోబల్ టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డా. పిల్లి గురూరాజుని మంత్రాలయం టీడీపీ ఇంచార్జి శ్రీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ సతీమణి శ్రీమతి ఎన్.యశోదమ్మ , యువ నాయకులు ఎన్. రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డా. గురూరాజుకి మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతో గ్లోబల్ స్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రవాస తెలుగువారిని ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న డా. గురూరాజుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు.

## ధరల భారంపై సీపీఐ గళం -
## మంత్రాలయం ఎమ్మార్వోకి వినతి




మంత్రాలయం, శివసూర్య: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంత్రాలయం ఎమ్మార్వో కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన అనంతరం ఎమ్మార్వో కె.రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులతో రైతాంగం ఇబ్బందుల్లో ఉంటే, బియ్యం, నూనె, పంచదార, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యుడికి భారంగా మారాయన్నారు. గతంలో 400 ఉన్న గ్యాస్ సిలిండర్ కు 10 రూపాయలు పెరిగితేనే ఆందోళన చేసిన వారు, ఇప్పుడు 1100 దాటినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేంద్రం వెంటనే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు హనీఫ్, సీపీఐ సహాయ కార్యదర్శులు మణికంఠ యాదవ్, కేశవ్, నాయకులు సంజీవ, ధనుష్, మస్తాన్, తిమ్మయ్య పాల్గొన్నారు.

## మంత్రాలయంలో హుండీకి కాసుల వర్షం -
## 16 రోజుల్లో రూ.3.30 కోట్లు జమ



మంత్రాలయం, శివసూర్య: మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి మఠం చరిత్రలో హుండీ ఆదాయం సరికొత్త రికార్డు సృష్టించిందని శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు తెలిపారు. 355వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలిరావడంతో హుండీ కలెక్షన్ రెట్టింపు అయిందని మఠం ఏ ఏ ఓ మాధవ శెట్టి తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 16 రోజులకు గాను బుధవారం మఠం అధికారులు హుండీలను తెరిచి లెక్కించారు. నోట్ల రూపంలో రూ.3,20,66,639, చిల్లర రూపంలో రూ.10,02,500 కలిపి మొత్తం రూ.3,30,69,139 ఆదాయం వచ్చింది. అదేవిధంగా 47 గ్రాముల బంగారం, 632 గ్రాముల వెండి కానుకలుగా వచ్చాయని తెలిపారు. వచ్చిన నగదును బ్యాంకుల్లో జమ చేస్తామన్నారు.ఈ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ శాఖ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్ జోషి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అనంత్ పురాణిక్, సూపరింటెండెంట్ చిలకలదోన రాఘవేంద్ర, సెక్యూరిటీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## మంత్రాలయం మీదుగా
## ప్రకృతి ప్రేమికుడి సాహసయాత్ర - ఘనంగా సత్కారం



మంత్రాలయం: శివ సూర్య కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు కి చెందిన విజయ్ గోపాల్ కృష్ణ జల జంతు జన సంరక్షణ కార్యక్రమం లో భాగంగా రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ 12 నదుల సందర్శన కార్యక్రమం ను సైకిల్ యాత్ర తో నిర్వహించారు. బుధవారం సైకిల్ యాత్ర మంత్రాలయంకి చేరుకోవడంతో మాజీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మాజీ ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, మల్లికార్జున, శివ కుమార్, బాలరాజు విజయ్ గోపాల్ కృష్ణ కి శాలువ కప్పి సన్మానించి తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు... లక్ష కిలోమీటర్ల సైకిల్ యాత్ర లో ఇప్పటి వరకు దాదాపు 95 వేల కిలోమీటర్ల యాత్ర లో 11 నదులు సందర్శించడం జరిగిందని వివరించారు.. బ్రహ్మపుత్ర నది వరకు ఈ యాత్ర గోదావరి జిల్లా మీదుగా సాగుతుందని తెలిపారు....

## వినాయక ఉత్సవాల్లో
## నిబంధనలు తప్పనిసరి - ఎస్సై విజయ్ కుమార్



మాధవరం, శివసూర్య: ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల వినాయక మండలి నిర్వాహకులు, గ్రామ పెద్దలతో ఎస్సై వై. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుండి ముందుగానే అనుమతులు పొందాలని, మండపాల ఏర్పాటుతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ వైరింగ్ లో జాగ్రత్తలు పాటించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. శబ్ద పరికరాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే వినియోగించాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇతర మతాల మనోభావాలు దెబ్బతీసే పాటలు, పోస్టర్లు, బ్యానర్లు పెట్టరాదని, మండపాల వద్ద డ్యాన్సులు, మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలు చేయరాదని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో పోలీసులు సూచించిన మార్గాలు, సమయాలు పాటించాలని, ఊరేగింపులో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు.

## ఉచితంగా 200 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మంత్రాలయం, శివసూర్య: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రాలయంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు సహృదయ సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన 200 మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు మూలింటి చంద్రశేఖర్ గౌడ్ (గ్యాస్ గౌడ్), మూలింటి రాఘవేంద్ర గౌడ్, సంతోష్ గౌడ్ తెలిపారు. పరమపూజ్య శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదుల వారి అమృత హస్తాల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదుల వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాల పూజ వల్ల ప్రకృతికి హాని జరగదని, ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.విగ్రహాలు కావాల్సిన వారు ఈ నెల 12వ తేదీలోగా 84988 32149 నంబర్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## గోమాత సేంద్రియ ఎరువులతోనే కలుషితం లేని ఆహారం

బిజెపి నాయకులు మధు గౌడ్...

గోమాతను రాజమాతగా ప్రకటించాలని పోస్టల్ విడుదల..




కర్నూలు,శివసూర్య, సెప్టెంబర్ 9: మన పూర్వీకులు గోమాత యొక్క సేంద్రియ ఎరువులను పంటలకు వేసి పండించి.. తద్వారా వచ్చిన ఆహారంతోనే పూర్ణాయూష్షు తో సుమారు 100 ఏళ్ళు బతికే వారని... అదే నేడు మనం తీసుకునే కల్తీ ఆహారంతో 50, 60 ఏళ్లకే ఆయు ప్రమాణం పడిపోయిందని




బిజెపి నాయకులు మధు గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక బాలాజీ నగర్ బిజెపి కార్యాలయం వద్ద గోమాతను రాజమాతగా ప్రకటించాలని వాల్ పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. మన పెద్దలు గోమాతను కుటుంబ సభ్యులలో ఒకరిగా చూసుకుంటూ ఎంతో ఉన్నతమైన జీవితాలు, ఆయురారోగ్యాలతో బ్రతికే వారని ఆయన గుర్తు చేశారు. అందుకే నేటి ఆధునిక కాలంలో కూడా గోమాత యొక్క సేవలను మనము సద్వినియోగం చేసుకొని, గోమాత పేడ మూత్రము లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకొని మనం కలుషితం లేని ఆహార ఉత్పత్తులను పండించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అందుకే గోమాత యొక్క భద్రత కోసం గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించి మనమందరం ఆదరించాలని ఆయన వివరించారు. అనంతరం గోవు సంరక్షణ పరిరక్షణ సభ్యుడు సఫారీ గోవిందరాజు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గోమాత భద్రత కోసం కఠిన చట్టాలను తీసుకువచ్చినప్పుడే గోమాతను మనం కాపాడుకోగలమని ఆయన గుర్తు చేశారు. గోమాత సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. గోమాత సంరక్షణలో భాగస్వాములైన సభ్యుల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుందని సుమారు 5,435 కు చేరిందని ఆయన తెలిపారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు సిటీ రైల్వే బోర్డు మెంబర్ బెస్ట్ ఈరన్న, క్లస్టర్ ఇంచార్జి ఆచారి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో "జయహో బీసీ" కార్యక్రమంలో పాల్గొన్న

పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్

బీసీల సంక్షేమం, అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

"నిజం గెలిచింది" -- 53 కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

బీసీలకు అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీ -- మామిడి గోవిందరావు






మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 09: నర్సీపట్నంలో నిర్వహించిన "జయహో బీసీ" కార్యక్రమంలో పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీసీల హక్కులు, సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం తెలుగుదేశం పార్టీ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.బీసీల సంక్షేమం, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. బీసీలకు అండగా నిలిచిన పార్టీ టీడీపీ అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు.విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అదేవిధంగా, నర్సీపట్నంలో నిర్వహించిన "నిజం గెలిచింది" కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. గత వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అన్యాయంగా అరెస్ట్ చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిన విధానాన్ని నిరసిస్తూ 53 కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు."నిజం ఎప్పటికీ ఓడిపోదు.. నిజాయితీ ఎప్పటికీ తలవంచదు" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా చంద్రబాబు నాయుడు నిజాయితీ, నిబద్ధతకు ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కక్ష సాధింపు రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు , పలువురు బీసీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## 53 విద్యుత్ కాంతులతో
## అక్రమ అరెస్టులపై నిజం గెలిసింది



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 09 : మెళియాపుట్టి మండల కేంద్రంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు ( ఎంజీఆర్) ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు అక్రమ



అరెస్టుపై నిజం గెలిచింది అనే నినాదంతో..... 2023 సెప్టెంబర్ 9న అప్పటి ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు పై గత వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు చంద్రబాబు నాయుడు ని జైలులో పెట్టినందుకు ఆయన గడిపిన చీకటి రోజులకు గాను సెప్టెంబర్ 9 ఆయన అక్రమ అరెస్టుకు నిరసనగా 53 రోజులుగాను ఒక్కొక్క రోజుకి ఒక్కొక్కటి దీపం చొప్పున 53 దీపాలను.. మెళియాపుట్టి మండలం వసుంధర, బందపల్లి, పెద్ద లక్ష్మీపురం, పట్టుపురం తదితర గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో 53 దీపాలను వెలిగించి మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై నిజం గెలిచింది అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .ఈ కార్యక్రమంలో కోసమాల పిఎసిఎస్ చైర్మన్ స్థానం మోహన్ రావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, బూర్ల లలిత కుమారి, బసవ పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ సేవలకు శ్రీకారం

మొదటి శస్త్రచికిత్స విజయవంతం....



అశ్వారావుపేట ఆర్సి/ సెప్టెంబర్ 9 అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇప్పటివరకు శస్త్రచికిత్సల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన రోగులకు ఇకపై స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం కలిగింది. ఆసుపత్రిలో కొత్తగా ఐదుగురు వైద్యులు విధుల్లో చేరడంతో వైద్య సేవలను మరింత విస్తరించారు.జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో దమ్మపేట మండలానికి చెందిన మొడియం జ్యోతికి మోకాలి పైభాగంలో ఉన్న కణితిని తక్కువ మోతాదులో మత్తు మందు ఇచ్చి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.జనరల్ సర్జరీ సేవలు ప్రారంభం కావడంతోఅశ్వారావుపేటతో పాటు పరిసర మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. శస్త్రచికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు, ప్రయాణ ఖర్చులు తగ్గనున్నాయి. స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంపై రోగులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అశ్వారావుపేట ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి రవిబాబులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ప్రధాన నర్సింగ్ అధికారి వర్ధిని, శస్త్రచికిత్స గది నర్సింగ్ అధికారి సుజాతతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.స్థానికంగానే జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి రావడంతో అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి వైద్య సేవల విస్తరణలో మరో కీలక ముందడుగు వేసినట్లైంది.




## గిరిజన బాలుర హాస్టల్‌లో నీటి కష్టాలు.. విద్యార్థుల ర్యాలీ
## స్పందించిన డిప్యూటీ కలెక్టర్.. వెంటనే బోరు మోటర్ మంజూరు

అశ్వారావుపేట ఆర్సి / సెప్టెంబర్ 9 :స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, మండల కన్వీనర్ మురారి రఘు విద్యార్థులతో కలిసి డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి హాస్టల్‌లో నెలకొన్న నీటి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బాలుర వసతి గృహంలో ఇప్పటివరకు బోరు మోటర్ లేకపోవడంతో విద్యార్థులు వీధి కుళాయిలపైనే ఆధారపడి రోజువారీ అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందన్నారు. గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా కాకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన డిప్యూటీ కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, హాస్టల్ వార్డెన్‌ను పిలిపించి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే బోరు మోటర్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారుల తక్షణ స్పందనతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి డిప్యూటీ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నిజం గెలిచిందిలి... న్యాయం నిలిచింది!




నందవరం, శివసూర్య, సెప్టెంబర్ 9:ఎమ్మిగనూరు శాసనసభ ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిజం గెలిచింది న్యాయం నిలిచింది అనే కార్యక్రమం చేపడం జరిగిందిఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రివర్యులు మన్యం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు పరాకాష్టి జరిగిన మూడు సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో చీకటి రోజు చంద్రబాబు గారి అక్రమ అరెస్టు చేసి నిర్బంధించిన రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది తెలుగు ప్రజల గుండెల్లో తల్లడిల్లిన రోజు ,(సైకో జగన్ పతనం ప్రారంభమైన రోజు) 2024 సెప్టెంబర్ నెల 9వ తారీకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో నంద్యాల జిల్లాలో అక్రమ అరెస్టుకు నాంది పలుకుతూ కొవ్వొత్తులతో మూడు సంవత్సరాల క్రితం జరిగినలి నిజం గెలిచిందిలి... న్యాయం నిలిచింది!అక్రమ అరెస్టులతో నిజాన్ని అణచివేయాలని చూసినా... న్యాయం కోసం నిలబడిన నాయకుడి సంకల్పాన్ని ఎవరూ ఆపలేకపోయారు.మూడు సంవత్సరాల క్రితం జరిగిన అక్రమ అరెస్టు ఒక చీకటి అధ్యాయం... కానీ ఆ చీకటిని చీల్చుకుంటూ చివరికి నిజమే విజయం సాధించింది!కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా, అవమానాలు ఎదురైనా ప్రజల కోసం పోరాడుతూ, న్యాయం కోసం నిలిచిన నారా చంద్రబాబు నాయుడు పోరాటానికి ఈ విజయం ఒక నిదర్శనం.అరెస్టు చేయగలిగారు... కానీ ఆత్మవిశ్వాసాన్ని అరెస్టు చేయలేకపోయారు. కేసులు పెట్టగలిగారు... కానీ నిజాన్ని ఓడించలేకపోయారు..నిజం గెలిచింది... న్యాయం గెలిచింది... ప్రజాస్వామ్యం గెలిచింది. ఈ కార్యక్రమంలో న సోమల గూడూరు టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, నరసింహులు, మునుస్వామి, కడియాల పెద్దయ్య, దస్తగిరి,గ్రామ నాయకులు కార్యకర్తలు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులపై నిజం గెలిసింది




మెళియాపుట్టి : మెళియాపుట్టి మండల కేంద్రంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు ( ఎంజీఆర్) ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుపై నిజం గెలిచింది అనే నినాదంతో..... 2023 సెప్టెంబర్ 9న అప్పటి ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు పై గత వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు చంద్రబాబు నాయుడు ని జైలులో పెట్టినందుకు ఆయన గడిపిన చీకటి రోజులకు గాను సెప్టెంబర్ 9 ఆయన అక్రమ అరెస్టుకు నిరసనగా 53 రోజులుగాను ఒక్కొక్క రోజుకి ఒక్కొక్కటి దీపం చొప్పున 53 దీపాలను.. మెళియాపుట్టి మండల కేంద్రంలో స్థానిక రాజా వీధిలో శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం ఆర్గనైజింగ్ సెక్రటరీ (కార్యనిర్వాహణ కార్యదర్శి) అనపాన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 53 దీపాలను వెలిగించి మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై నిజం గెలిచింది అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల ఐటీడీపీ అధ్యక్షులు దుక్క శంకర్ రెడ్డి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఒట్టికుళ్ళ చక్రి, స్థానిక సీనియర్ టిడిపి నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్ నక్కల. సీతయ్య రెడ్డి, యూనిట్ కన్వీనర్ కొత్త. హిమంత్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షురాలు అనపాన రాజరత్నం, మాజీ సర్పంచ్ ప్రతినిధి తలసంద్రం గోపి, సంతోష్ డోలాయి, స్థానిక టిడిపి నాయకులు గాలి రామారావు రెడ్డి,బోను మన్మధ, బోను రుద్రయ్య, బోను నీలకంటు, మాడుగుల రవణ, మారం హరి, చిప్పాడ జ్ఞానేశ్వరరావు, గాసి సూరి, సీమల లింగరాజు, బురగాన రాజారావు, కమ్మ కట్ల మని, ప్రసాద్, మహిళలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భూ సర్వేతో భవిష్యత్తుకు భరోసా!

సమగ్ర పునఃసర్వేలో తప్పిదాలకు తావులేకుండా చూడాలి..

మద్నూర్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన బాన్సువాడ రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి



జుక్కల్ సెప్టెంబర్ 09:భూమి హద్దులు.. రైతుల హక్కులు.. ఓటర్ల వివరాలు.. ప్రజా సమస్యలు.. ఇలా ఒకే రోజు పలు అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. బాన్సువాడ రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి బుధవారం మద్నూర్ మండలంలో విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమాలను పరిశీలించారు ఓటర్ల వివరాల పరిశీలన కేంద్రాల్లో తనిఖీమద్నూర్ మండలం పెద్ద ఎక్లార గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన కేంద్రాలను రవీందర్ రెడ్డి పరిశీలించారు. విచారణకు హాజరైన ఓటర్లతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ధ్రువపత్రాల సమర్పణ, వివరాల నమోదు, పత్రాల నిక్షేపణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.కాలువ.. పొలాల దారిపై క్షేత్రస్థాయి పరిశీలనమేనూర్ గ్రామ శివారులో పంట కాలువ, పంట పొలాలకు వెళ్లే దారికి సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ డివిజన్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తహసీల్దార్, భూమి కొలతల అధికారి, గిర్దావర్‌లతో కలిసి సంబంధిత భూములు, కాలువలను పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులు, భూమి కొలతల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

### నక్షలు లేవు..
### పటాలు లేవు.. అయినా పునఃసర్వే!

సోమూర్ గ్రామంలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న భూముల పునఃసర్వే పనులను రవీందర్ రెడ్డి పరిశీలించారు. గ్రామానికి సంబంధించిన నక్షలు, పటాలు అందుబాటులో లేకపోవడంతో గ్రామ సరిహద్దులు, పంట పొలాలు, పట్టాదారుల భూములు, ప్రభుత్వ భూములను గుర్తిస్తూ హద్దులు ఏర్పాటు చేస్తున్నారు.పత్తి, సోయా పంట పొలాల్లోకి వెళ్లిన రెవెన్యూ డివిజన్ అధికారి సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి పునఃసర్వేలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.“భూ వివాదాలు తగ్గుతాయి”.. రైతుల ఆనందంపునఃసర్వేపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత ప్రభుత్వం భూముల సర్వే చేపట్టి హద్దులు గుర్తించడం, నక్షలు--పటాలు రూపొందించడం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండటం వల్ల తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు. కాళోజీకి ఘన నివాళిఅనంతరం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రవీందర్ రెడ్డి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజా కవులు, రచయితల రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించాయని గుర్తుచేశారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ఎం.డి. ముజీబ్, డీఐ తిరుమలేశ్, భూమి కొలతల అధికారి వెంకటి, గిర్దావర్ మురలీధర్, జూనియర్ సహాయకుడు రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, అనుమతి పొందిన భూమి కొలతల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా కవి కాళోజీ నారాయణరావు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి







వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 9 సెప్టెంబర్ 2026 బుధవారంబుధవారం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (×ఖూజ)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్‌తో కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం తన రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తన రచనల ద్వారా సామాన్య ప్రజల సమస్యలను, వారి ఆకాంక్షలను సమాజం ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు.కాళోజీ సాహిత్యం ప్రజల జీవితాలకు అద్దం పట్టిందని, ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తాయని కలెక్టర్ తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగించి, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.కాళోజీ నారాయణరావు చూపిన మార్గంలో ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏవో భాను ప్రకాష్, డి పి ఆర్ ఓ సీతారాం, బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సిరాజుద్దీన్, కార్మిక శాఖ అధికారి రవి, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకులు గంధం నాగరాజు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఏ ఆర్ అదనపు ఎస్పీ

అన్యాయంపై అక్షర సమరం చేసిన ప్రజాకవి కాళోజీ. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కాళోజీ సాహిత్యం కీలక పాత్రవీరారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 9 సెప్టెంబర్ 2026 బుధవారంబుధవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమాల గొంతుక శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి పోలీసు కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ..“ప్రజల బాధను తన బాధగా భావించి, అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించిన మహోన్నత ప్రజాకవి కాళోజీ నారాయణరావు. తన కలం ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన ఆయన సేవలు చిరస్మరణీయం. కాళోజీ సాహిత్యం కేవలం రచనలకు పరిమితం కాకుండా ప్రజా చైతన్యానికి ఒక




ఉద్యమంగా నిలిచింది. ఆయన ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి. పోలీసు అధికారులు, సిబ్బంది కూడా ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, నిష్పక్షపాతంగా, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు ఎస్పీపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ నాయక్, పోలీస్ కార్యాలయం ఏఓ, సునంద, స్పెషల్ స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు,పర్వతాలు, రామేశ్వర్ రెడ్డి, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దుం భారీ, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, గోవింద్, పోలీస్ సిబ్బంది, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాయామం చేయకుండానే చెమట పడుతోందా? గుండె ఇచ్చే ఈ సంకేతాలను గమనించండి!

కారణం లేకుండా చెమట పడితే జాగ్రత్త

చల్లటి చెమట గుండెపోటు సంకేతం కావొచ్చంటున్న నిపుణులు

ఛాతీలో అసౌకర్యంతో చెమట వస్తే నిర్లక్ష్యం చేయొద్దు

ఆయాసం, తలతిరగడం ఉంటే అప్రమత్తంగా ఉండాలని సూచన

రోజువారీ పనుల్లో అధిక చెమటను గమనించాలని సలహా



చెమట పట్టడం సహజమే. ఎండలో ఉన్నప్పుడు, వ్యాయామం చేసినప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు చెమట రావడం సాధారణం. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఒక్కసారిగా విపరీతంగా చెమట పడితే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, వికారం, తల తిరగడం లేదా అకస్మాత్తుగా నీరసం వంటి లక్షణాలు కూడా ఉంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు.



గుండె సమస్యతో చెమట ఎందుకు పడుతుంది?

గుండెపై తీవ్ర ఒత్తిడి పడినప్పుడు శరీరం అత్యవసర పరిస్థితిలో ఉన్నట్లు స్పందిస్తుంది. గుండెపోటు సమయంలో సింపథెటిక్ నాడీ వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. దీంతో గుండె వేగం పెరగడం, రక్తపోటులో మార్పులు రావడం, చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేయడం జరుగుతుంది.

అప్పుడు ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టొచ్చు. చర్మం వేడిగా కాకుండా తడిగా, జిగటగా అనిపించొచ్చు. ఊరికే కూర్చున్నా ఈ పరిస్థితి రావచ్చు.

ఇతర లక్షణాలు ఉంటే మరింత జాగ్రత్త

చెమట ఒక్కటే వస్తే గుండె సమస్య అని చెప్పలేం. జ్వరం, ఆందోళన, రక్తంలో చక్కెర తగ్గడం, హార్మోన్ల మార్పులు, ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల కూడా చెమట పట్టొచ్చు. అయితే చెమటతో పాటు ఛాతీలో బిగుతు లేదా భారంగా అనిపించడం, చేయి, భుజం, వీపు, మెడ లేదా దవడ భాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, తల తిరగడం, తీవ్రమైన నీరసం, గుండె వేగం మారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.





### రోజువారీ పనుల్లోనూ చెమట ఎక్కువగా వస్తోందా?

ఇంతకుముందు సులభంగా చేసిన పనికే ఇప్పుడు విపరీతంగా చెమట పడుతోందా? మెట్లు ఎక్కడం, నడవడం లేదా ఇంటి పనులు చేస్తున్నప్పుడు చెమటతో పాటు ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వస్తోందా? అయితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఉదాహరణకు గతంలో 30 నిమిషాలు సులభంగా నడిచిన వ్యక్తికి ఇప్పుడు 10 నిమిషాలకే చెమట, ఆయాసం, నీరసం వస్తే.. ఆ మార్పును గమనించాలి.

### రాత్రిపూట చెమట పడితే?

రాత్రి చెమట పట్టడానికి చాలా కారణాలు ఉండొచ్చు. గది వేడిగా ఉండటం, ఇన్ఫెక్షన్లు, హార్మోన్ల మార్పులు, కొన్ని మందులు ఇందుకు కారణం కావచ్చు. అయితే రాత్రిపూట చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, గుండె దడ లేదా నిద్ర నుంచి నీరసంతో మేల్కొనే పరిస్థితి పదేపదే వస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.

### ఎప్పుడు అత్యవసర చికిత్స అవసరం?

ఒక్కసారిగా విపరీతమైన చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, స్పృహ తప్పే పరిస్థితి, తీవ్రమైన నీరసం లేదా చేయి, దవడ, వీపు, భుజానికి నొప్పి ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. లక్షణాలు కొన్ని నిమిషాల్లో తగ్గిపోయినా నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని గుండె సమస్యల్లో లక్షణాలు వచ్చి తగ్గుతూ ఉండొచ్చు.

మీకు సాధారణంగా ఎంత చెమట పడుతుందో తెలుసుకోవడం ముఖ్యం. సాధారణానికి భిన్నంగా ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టడం, ముఖ్యంగా ఇతర లక్షణాలతో కలిసి కనిపించడం గమనించాల్సిన సంకేతం. ఎప్పుడు చెమట పడుతోంది? ఎంతసేపు ఉంటోంది? ఆ సమయంలో ఏ లక్షణాలు కనిపిస్తున్నాయో గుర్తుపెట్టుకుంటే వైద్యుడికి పరిస్థితిని వివరించడంలో ఉపయోగపడుతుంది.

# గుడ్డు తాజాగా ఉందో? లేదో? 10 సెకన్లలో తెలుసుకోండి..

ఎఫ్ఎస్ఎస్ఏఐ టిప్ ఇదే!

నీటితో గుడ్డు తాజాదనం తెలుసుకునే అవకాశం

అడుగున అడ్డంగా ఉంటే గుడ్డు తాజాగా ఉన్నట్లేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచన

నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థమని వెల్లడి



ఫ్రిజ్ తెరిచారు.. అందులో కొన్ని రోజులుగా ఉన్న గుడ్లు కనిపించాయి. అవి తాజాగా ఉన్నాయా? తినొచ్చా? అనే సందేహం రావడం సహజమే. పెంకును చూస్తే గుడ్డు పరిస్థితి తెలియదు. అలాగే అమ్మినవాళ్లు తాజావే ఇచ్చారా? అనే అనుమానమూ వస్తుంటుంది. అయితే ఇకపై అలాంటి సందేహాలు అవసరం లేదు. ఇంట్లో ఉన్న నీళ్లతోనే గుడ్డు తాజాగా ఉందో? పాతదైందో సులభంగా తెలుసుకోవచ్చు. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) ఈ సింపుల్ పద్ధతిని సూచించింది.

ఓ గ్లాసు నీళ్లు చాలు

ఓ గ్లాసులో సగం వరకు నీళ్లు పోయాలి. అందులో గుడ్డును వేయాలి. గుడ్డు నీటి అడుగుకు వెళ్లి అడ్డం తిరిగితే అది తాజాగా ఉన్నట్లు అర్థం. అదే అడుగున నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థం. అయితే వెంటనే దాన్ని పాడైందిగా భావించాల్సిన అవసరం లేదు. వాడే ముందు మరోసారి పరిశీలించాలి.

గుడ్డు నీటి పైకి తేలితే మాత్రం జాగ్రత్త. అది పాడై ఉండే అవకాశం ఉంది. అలాంటి గుడ్డును తినకుండా పడేయడం మంచిది.

పగలగొట్టాక కూడా చూడాలి

నీటి పరీక్షతో పాటు గుడ్డును పగలగొట్టిన తర్వాత కూడా కొన్ని విషయాలు గమనించాలి. గుడ్డులోంచి వింత వాసన వస్తే తినకూడదు. రంగులో మార్పు కనిపించినా వాడకూడదు. పెంకులో పగుళ్లు ఉన్నా, గుడ్డు నుంచి ద్రవం కారుతున్నా దాన్ని తీసుకోవద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచిస్తోంది.

### ఫ్రిజ్‌లో ఎక్కడ పెట్టాలి?

గుడ్లను ఎక్కువకాలం తాజాగా ఉంచాలంటే వాటిని సరైన విధంగా భద్రపరచడం కూడా ముఖ్యం. తెచ్చిన ప్యాకింగ్‌లోనే గుడ్లను ఉంచడం మంచిది. ఇతర ఆహార పదార్థాల వాసనలు వాటికి పట్టకుండా ఇది ఉపయోగపడుతుంది. ఫ్రిజ్ తలుపులో కాకుండా షెల్ఫ్‌పై ఉంచడం మంచిది. తలుపు తరచూ తెరవడం వల్ల ఉష్ణోగ్రతలో మార్పులు వస్తాయి.

ఈ చిన్న జాగ్రత్తలు తప్పనిసరి

ఫ్రిజ్ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టే ముందు కడగకూడదు. అవసరమైతే వాడే ముందు మాత్రమే కడగాలి. అలాగే కొన్న గుడ్లను ముందుగా ఉపయోగిస్తే అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవచ్చు.

# పాలలో డిటర్జెంట్ కలిసిందా? ఇంట్లోనే ఇలా సులభంగా చెక్ చేసుకోండి



5-10 మిల్లీలీటర్ల పాలను గ్లాసులోకి తీసుకోవాలి

పాలను గట్టిగా షేక్ చేసి బుడగలను గమనించాలి

బుడగలు ఎక్కువసేపు ఉంటే కల్తీగా అనుమానించాలి

ఇంట్లో పరీక్ష తుది నిర్ధారణ కాదని గుర్తుంచుకోవాలి

ప్రతి ఇంట్లో నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాల్లో పాలు ఒకటి. ఉదయం టీతో మొదలుకొని రాత్రి పడుకునే ముందు తాగే గ్లాసు వరకు పాలు ఉండాల్సిందే. అయితే పాల విషయంలో కల్తీ ఆందోళన కలిగిస్తోంది. పాలు పలుచగా కనిపించకుండా, నురుగు వచ్చేలా కనిపించేందుకు డిటర్జెంట్ వంటి పదార్థాలను కలుపుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరి మన ఇంట్లో వాడుతున్న పాలలోనూ డిటర్జెంట్ కలిసిందా? తెలుసుకోవడానికి ల్యాబ్ అవసరం లేదట. ఇంట్లోనే ఓ చిన్న పరీక్ష చేసుకోవచ్చని ఆహార భద్రతా అధికారులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పరీక్ష ఏంటి? తెలుసుకుందాం..

ఓ చిన్న గ్లాసు చాలు

ముందుగా 5 నుంచి 10 మిల్లీలీటర్ల పాలను ఓ చిన్న గ్లాసులోకి తీసుకోండి. ఇప్పుడు దాన్ని గట్టిగా షేక్ చేయండి. ఆ తర్వాత పాలలో ఏం జరుగుతుందో కాసేపు గమనించండి. అంతే.. మీ ముందే ఓ సంకేతం కనిపిస్తుంది.

బుడగలు ఏం చెబుతున్నాయి?

షేక్ చేసిన వెంటనే బుడగలు ఏర్పడి త్వరగా మాయమైతే పాలలో డిటర్జెంట్ కల్తీ ఉన్నట్లు భావించాల్సిన అవసరం లేదని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అదే బుడగలు ఎక్కువగా ఏర్పడి కొంతసేపు అలాగే ఉంటే మాత్రం అనుమానించాల్సి ఉంటుంది. డిటర్జెంట్ కల్తీకి ఇది ఓ సూచన కావచ్చని పేర్కొంది.

బుడగలు ఎందుకు వస్తాయి?

ఇక్కడే అసలు విషయం ఉంది. డిటర్జెంట్లలో ఉండే సర్ఫాక్టెంట్లు ద్రవం ఉపరితల ఉద్రిక్తతను తగ్గిస్తాయి. దీంతో పాలను షేక్ చేసినప్పుడు ఏర్పడిన గాలి చుట్టూ పలుచని పొర ఏర్పడుతుంది. ఫలితంగా బుడగలు వెంటనే పగిలిపోకుండా ఎక్కువసేపు నిలుస్తాయి. స్వచ్ఛమైన పాలలో మాత్రం ఈ బుడగలు అంతగా నిలవవు.

పాలు కొనే ముందు..

కల్తీకి దూరంగా ఉండాలంటే నమ్మకమైన బ్రాండ్లను ఎంచుకోవడం మంచిది. ప్యాకెట్ లేదా కార్టన్ కొనేటప్పుడు సీల్ సరిగా ఉందో చూడాలి. పదార్థాల వివరాలను పరిశీలించాలి. ప్యాకెట్‌పై ఉన్న ఎఫ్ఎస్-ఎస్ఏఐ లోగోతో పాటు 14 అంకెల లైసెన్స్ నంబర్‌ను కూడా చెక్ చేసుకోవాలి. అయితే ఇంట్లో చేసే ఈ పరీక్షను ప్రాథమిక సూచనగా మాత్రమే చూడాలి. పాలు కల్తీగా ఉన్నాయనే తుది నిర్ధారణకు అధికారిక పరీక్ష అవసరం. అయినప్పటికీ.. రోజూ తాగే పాల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండేందుకు ఈ చిన్న టెస్ట్ ఉపయోగపడుతుంది.

# కాంతులీనే చర్మం కోసం ఈ 5 ఫ్రూట్స్ ట్రై చేయండి!

చర్మం బిగుతుగా, యవ్వనంగా కనిపించడానికి కొల్లాజెన్ కీలకం

వయసు పెరిగే కొద్దీ శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగా తగ్గుతుంది

విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు కొల్లాజెన్ తయారీకి తోడ్పడతాయి

జామ, కివీ, నారింజ, స్ట్రాబెర్రీ, బొప్పాయి వంటి పండ్లు తీసుకోవడం మేలు

ఈ పండ్లలో కొల్లాజెన్ ఉండదు, కానీ దాని ఉత్పత్తికి శరీరానికి సాయపడతాయి



చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా, యవ్వనంగా కనిపించడంలో కొల్లాజెన్ అనే ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. చర్మానికి బిగుతుదనాన్ని, నిర్మాణాన్ని ఇచ్చేది ఇదే. అయితే వయసు పెరిగే కొద్దీ మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగానే మందగిస్తుంది. ఈ ప్రక్రియను పూర్తిగా ఆపలేకపోయినా, సరైన పోషకాహారం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి శరీరం సిద్ధమయ్యేలా చేయవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా అవసరం. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వవచ్చు. కేవలం ఒక పండుతో రాత్రికి రాత్రే అద్భుతాలు జరగవని, కానీ సమతుల్య ఆహారం, మంచి జీవనశైలితో పాటు వీటిని తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడే 5 ముఖ్యమైన పండ్లు:

1. జామ : ఇందులో విటమిన్ సి అత్యధికంగా ఉంటుంది. కొల్లాజెన్ సంశ్లేషణకు విటమిన్ సి చాలా అవసరం. జామపండును నేరుగా తినొచ్చు లేదా ఫ్రూట్ సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు.

2. కివీ : విటమిన్ సికి కివీ పండు ఒక అద్భుతమైన వనరు. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడతాయి.

3. నారింజ: విటమిన్ సి అనగానే అందరికీ గుర్తొచ్చేది నారింజ. దీన్ని నేరుగా తినడం లేదా రసం రూపంలో తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్ సి అందుతుంది.



4. స్ట్రాబెర్రీ : ఈ పండ్లలో విటమిన్ సి తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. స్మూతీలు, యోగర్ట్ లేదా ఓట్స్‌తో కలిపి వీటిని తీసుకోవచ్చు.

5. బొప్పాయి : విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు బొప్పాయిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, చర్మాన్ని సంరక్షిస్తాయి.

ఒక ముఖ్య గమనిక: ఈ పండ్లలో నేరుగా కొల్లాజెన్ ఉండదు. కానీ, మన శరీరంలో కొల్లాజెన్‌ను తయారు చేసుకోవడానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కాబట్టి, కేవలం ఈ పండ్లపైనే ఆధారపడకుండా, సరైన ప్రోటీన్లు ఉన్న సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చర్మ సౌందర్యానికి అత్యంత ముఖ్యం.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



ఢిల్లీ: కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. హౌరా- చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖ, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ముంబై- చెన్నై కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపింది. అదే విధంగా దేశంలో 7 హై డెన్సిటీ రైల్వే కారిడార్ల అభివృద్ధికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రయాణికుల రద్దీ తగ్గించేందుకు భారతీయ రైల్వేల భారీ ప్రణాళికలో భాగంగా ఢిల్లీ-హౌరా, ఢిల్లీ-ముంబై కారిడార్లకు ప్రాధాన్యం ప్రకటించింది. ఢిల్లీ-చెన్నై మార్గంలో విజయవాడ కీలక స్టేషన్‌గా అదేవిధంగా హౌరా-చెన్నై కారిడార్‌లో విశాఖపట్నం స్టేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ముంబై-చెన్నై మార్గంలో రేణిగుంట, గుంతకల్ అభివృద్ధి కి ఊతం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ అంశమై రైల్వేశాఖ మంత్రి మాట్లాడుతూ పలు మార్గాల్లో నాలుగో లైన్ పనులు చేపట్టడంతో పాటు మరికొన్ని కారిడార్లు డీపీఆర్, ఆమోద దశలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర నిర్ణయాలతో సరుకు రవాణా, ప్రయాణికుల సేవల సామర్థ్యం పెరగనుందని రైళ్ల సమయపాలన మెరుగుపడుతుందని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీజేపీ ఉద్యమకారుడికి నోటీసులా?

# సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లో పాల్గొన్న ఒక విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడంపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిజెపి నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ, భవిష్యత్తులో వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారని కోర్టు ప్రశ్నించింది.. తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ నోటీసు ఎలా ఇస్తారంటూ భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి ఈ ఘటనపై వివరణ కోరనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూలైలో జరిగిన సీజేపీ నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి తామిచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ నోటీసు ఎలా జారీ చేస్తారు? మేజిస్ట్రేట్‌కు అంత ధైర్యమా?" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. గౌతమ్ బుద్ధ యూనివర్సిటీ రెండో సంవత్సరం విద్యార్థి అక్షత్ త్రిపాఠికి సెప్టెంబర్ 4న గ్రేటర్ నోయిడా మేజిస్ట్రేట్ నోటీసు పంపారు. నిరసనల్లో పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించినట్లు అందులో ఆరోపించారు. (ఈ నోటీసును మరుసటి రోజే ఉపసంహరించు కున్నట్లు కోర్టుకు తెలిపారు). ఇందుకు రూ. 5 లక్షల వ్యక్తిగత బాండ్‌ను అందించాలనికోరారు. అయితే ఆర్టికల్ 142 ప్రత్యేక అధికారాలను ఉపయోగించి, జూలై 20 - 25 మధ్య జబీూ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులన్నింటినీ సుప్రీంకోర్టు రద్దు చేసింది. అలాగే కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కూడా స్పష్టం చేసింది. కాగా సీజేఐ సూర్యకాంత్ అనూహ్య వ్యాఖ్యల తరువాత పుట్టుకొచ్చిన సీజేపీ నీట్ ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ముఖ్యంగా జెన్-జీ నుంచి ఈ పోరాటానికి లభించిన ఆదరణ, మద్దతు విశేషంగా నిలిచింది.

## అదేగనక జరిగితే లోకేశ్ జైలుకే: వరుదు కల్యాణి



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీని తిట్టడమే టీడీపీ నేతల పనా? అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. తాడేపల్లిలో ఆమె బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేయడం, పారిపోవడం టీడీపీ నేతలకే చెల్లిందని ఆమె విమర్శించారు. టీడీపీ నేతలు ఆధారాలు చూపించరని, దూషణలు మాత్రం చేస్తారని వరుదు కల్యాణి అన్నారు. డీఎస్సీలో అక్రమాలకు సమాధానాలు చెప్పకుండా పారిపోతున్నారని చెప్పారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేలతో ప్రెస్‌మీట్ పెట్టించి పచ్చి అబద్ధాలు చెప్పించారని తెలిపారు. డీఎస్సీలో అక్రమాలు చేయకపోతే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నారా వారి పాలన నకిలీ సర్టిఫికెట్ల పాలన అని ఆమె అన్నారు.

### ఆ స్థాయిలో భారీ స్కాం..

"డీఎస్సీలో విచారణ జరిగితే లోకేశ్ జైలుకే. ఆ స్థాయిలో భారీ స్కాం జరిగింది. స్కాంపై కూటమి నేతలు నోరు మెదపటం లేదు. సవాల్ చేసిన నేతలంతా ఇప్పుడెందుకు పారిపోయారు. టైం, డేట్ చెప్తే మేము చర్చకు రావటానికి సిద్ధమే. స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని కూడా చర్చకు తీసుకురావాలి. డీఎస్సీ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు ఇవ్వటం స్కాం కాదా? రూ.3 లక్షలకు 120 ప్రశ్నలు అమ్ముకోవటం స్కాం కాదా? రూ.20 లక్షల చొప్పున ఉద్యోగం అమ్ముకోవడం స్కాం కాదా? టెట్ లేని ప్రభాకర్ గౌడ్ కు ఉద్యోగం ఇవ్వటం స్కాం కాదా? ఫేక్ జూడో సర్టిఫికేట్లు తెచ్చిన వారికి ఉద్యోగం ఇవ్వటం స్కాం కాదా? వీటన్నిటిపై విచారణ జరగాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా? సీబీఐ విచారణ జరిగితే లోకేశ్ జైలుకు వెళ్లక తప్పదు. ఆ భయంతోనే సీబిఐతో విచారణ జరపటం లేదన్నది వాస్తవం కాదా? లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు తెచ్చుకున్న వారి దగ్గర టీడీపీ నేతలు తమ పిల్లలకు చదువు చెప్పిస్తారా? లోకేశ్ చేసిన తప్పులను కవర్ చేయలేక మహిళా అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఫేక్ ప్రచారం చేయటం ఎలాగో చంద్రబాబు, లోకేశ్ ట్రైనింగ్ ఇచ్చారు. అందుకే పార్టీ నేతలంతా బయటకు వచ్చి డీఎస్సీలో అక్రమాలు జరగలేదంటూ కబుర్లు చెప్పారు" అని వరుదు కల్యాణి అన్నారు.

## గవర్నర్ ఇవే అడిగారు: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో శాంతి భద్రతలపై గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు.. అసెంబ్లీ ఘటనలో పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించేలా పాలన కొనసాగుతుందన్నారు. "రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, యూరియా కొరత, రైతు బీమా, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసినందుకు గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యపై ఫిర్యాదు చేశామని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్స్ వేసుకున్నట్టే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీ షర్ట్స్ వేసుకున్నాము. బ్లాక్ టీ షర్ట్ తో అసెంబ్లీకి వెళ్తుంటే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు." అని కేటీఆర్ మండిపడ్డారు. "మాజీ హోం శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మగ పోలీసులు గొంతు పట్టుకున్నారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకొని లాగారు. దాడి చేసి మా పైనే ఉల్టా కేసులు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావు కోరుకున్నారు. వేముల వీరేశం, కుంభం అనిల్‌రెడ్డి, నర్సారెడ్డి ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గరకు వచ్చారు. వేల మంది కాంగ్రెస్ గూండాలను ఎర్రవల్లి ఫాం హౌస్‌పై దాడి చేసేందుకు ఉసిగొల్పారు. మేము అనని మాటలను అన్నట్టు స్పీకర్‌కు ఆపాదించారు. దళిత స్పీకర్ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్పీకర్‌ను అవమానిస్తున్నారు. ..శాసన సభ కాదు.. దుశ్శాసన సభలా మార్చారు. చావు డప్పు ఎప్పుడు కొడతారో.. మనందరికీ తెలుసు. ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గర చావు డప్పు కొట్టారు. అసెంబ్లీ బయట జరిగిన ఘటనపై సీఎస్ డీజీపీని పిలిపించి మాట్లాడుతానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మంచివి కాదని గవర్నర్ మాతో చెప్పారు." అని కేటీఆర్ వివరించారు.

# 9/11 వేళ.. గాల్లోకి లేచిన ఒకేఒక్క విమానం!




సెప్టెంబర్ 11, 2001.. అమెరికా చరిత్రలోనే అత్యంత విషాదకరమైన రోజు. విమానాలను హైజాక్ చేసి అమెరికాపై భీకర దాడులకు పాల్పడింది ఉగ్రసంస్థ అల్‌ఖైదా. అయితే ఆ దాడుల వేళ దేశవ్యాప్తంగా పౌర విమాన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆకాశం దాదాపు నిర్మానుష్యంగా మారింది. కానీ.. ఆ భయానక పరిస్థితుల్లోనూ ఓ విమానానికి ప్రత్యేక అనుమతితో గాల్లోకి ఎగిరింది.

సెప్టెంబర్ 9/11 దాడుల తర్వాత.. అనంతరం అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఫీూూ) దేశవ్యాప్తంగా పౌర విమానాలను నేలకే పరిమితం చేసింది. అమెరికా చరిత్రలో ఇలాంటి దేశవ్యాప్త పౌర విమానాల నిలిపివేత ఇదే తొలిసారి. అయితే ఆనాడు అత్యవసర పరిస్థితుల దృష్ట్యా.. సైనిక, అత్యవసర వైద్య విమానాలే తిరిగాయి. ఈ క్రమంలో.. ఎఫ్ఏఏకు ఓ ఎమర్జెన్సీ కాల్ వచ్చింది. ఫ్లోరిడాకు చెందిన స్నేక్ ఎక్స్‌పర్ట్ లారెన్స్ వాన్ సెర్టిమా.. ఒక ఇన్‌లాండ్ టైపాన్ పామును తిరిగి దాని బోనులో పెట్టే ప్రయత్నం చేయగా అది ఆయన బొటనవేలిని కాటేసింది. ఆస్ట్రేలియాకు చెందిన ఇన్‌లాండ్ టైపాన్ అనేది అత్యంత విషపూరితమైన పాముల్లో ఒకటి. కాటు తర్వాత ఆయన పరిస్థితి వేగంగా విషమించింది. స్పృహ కోల్పోవడంతోపాటు కళ్ల నుంచి, చెవుల నుంచి, నోటి నుంచి రక్తస్రావం మొదలైంది. మయామిలోని వైద్యులు అందుబాటులో ఉన్న యాంటీవెనమ్‌తో చికిత్స ప్రారంభించారు. అయితే అది సరిపోలేదు. ఇన్‌లాండ్ టైపాన్ విషానికి ప్రత్యేకంగా ఉపయోగించే యాంటీవెనమ్ అవసరమైంది. ఆ మందు అప్పట్లో న్యూయార్క్, శాన్‌డియాగోలోని జంతుప్రదర్శనశాలల్లో మాత్రమే లభ్యమవుతోంది. 9/11 దాడులతో న్యూయార్క్ పూర్తిగా కల్లోలంలో ఉండటంతో.. వైద్య బృందం దృష్టి శాన్‌డియాగోపై పడింది. వాన్ సెర్టిమా పరిస్థితి మరింత విషమించడంతో వైద్య, అగ్నిమాపక అధికారులు విమాన ప్రయాణానికి ప్రత్యేక అనుమతి కోరారు. గంటలపాటు చర్చల అనంతరం ఫీూూ అనుమతించింది. 2001 సెప్టెంబర్ 12న శాన్‌డియాగో నుంచి ఒక చిన్న లియర్‌జెట్ బయలుదేరింది. విమానం అమెరికా మీదుగా ప్రయాణిస్తుండగా రెండు ఫైటర్ జెట్లు దానికి ఎస్కార్ట్‌గా వెళ్లాయి. శాన్‌డియాగో నుంచి తెచ్చిన అదనపు యాంటీవెనమ్ మయామికి చేరిన తర్వాత వైద్యులు వెంటనే వాన్ సెర్టిమాకు అందించారు. చికిత్సకు స్పందించిన ఆయన చివరకు ప్రాణాలతో బయటపడ్డారు. రెండు రోజుల తర్వాత టీవీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. పాముదేం తప్పు లేదు..తన నిర్లక్ష్యమే కారణమంటూ ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారాయన.

### అమెరికా చరిత్రలో చీకటి రోజు

సెప్టెంబర్ 9, 2001.. 19 మంది ఆల్‌ఖైదా ఉగ్రవాదులు నాలుగు వాణిజ్య విమానాలను హైజాక్ చేశారు. రెండు విమానాలను న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఢీకొట్టించారు. మూడో విమానాన్ని వాషింగ్టన్ సమీపంలోని పెంటగాన్‌పైకి దించారు. నాలుగో విమానం ఫ్లైట్ 93ను ప్రయాణికులు తిరగబడటంతో పెన్సిల్వేనియాలోని ఖాళీ ప్రదేశంలో కూల్చివేశారు. ఉదయం 8.46 గంటలకు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 11 ఉత్తర టవర్‌ను ఢీకొట్టింది. 9.03 గంటలకు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 175 దక్షిణ టవర్‌ను ఢీకొట్టింది. 9.37 గంటలకు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 77 పెంటగాన్‌ను ఢీకొట్టింది. 10.03 గంటలకు ఫ్లైట్ 93 పెన్సిల్వేనియాలో కూలిపోయింది. కొద్దిసేపటికే ట్విన్ టవర్స్ రెండూ కుప్పకూలాయి.

### దాదాపు 3 వేల మంది బలి..

9/11 దాడుల్లో 2,977 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో న్యూయార్క్‌లో 2,753 మంది, పెంటగాన్‌లో 184 మంది, ఫ్లైట్ 93లో 40 మంది ఉన్నారు. 90కుపైగా దేశాలకు చెందిన ప్రజలు బాధితుల్లో ఉన్నారు. ఈ దాడులకు బాధ్యులు ఆల్‌ఖైదాకు చెందిన 19 మంది హైజాకర్లు. వారంతా ఆల్‌ఖైదా శిక్షణ పొందినవారేనని ఎఫ్‌బీఐ దర్యాప్తులో తేలింది. ఈ దాడుల వెనుక ఆల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఉన్నట్లు దర్యాప్తు నిర్ధారించింది. బిన్ లాడెన్ 2011 మే 2న పాకిస్థాన్‌లోని అబ్బొట్టాబాద్‌లో అమెరికా ప్రత్యేక దళాల ఆపరేషన్‌లో హతమయ్యాడు.

# నీటి కొరతతో సౌదీ అరేబియా ఏం చేసిందో తెలుసా?



ఎటు చూసినా ఎడారి.. మండే ఎండలు.. ఏడాదికి 100 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం.. శాశ్వత నదులు కూడా లేవు. అయినా సౌదీ అరేబియాలో 3.7 కోట్లకుపైగా జనాభా రోజువారీ అవసరాలకు నీటిని పొందుతోంది. మరి చుక్క నీటి కోసం కూడా ప్రకృతిపై ఆధారపడలేని ఈ దేశం.. కోట్లాది మందికి నీటిని ఎలా అందిస్తోంది? ఎడారి మధ్యలో ఇంత భారీ జలవ్యవస్థను ఎలా నిర్మించింది? సౌదీ అరేబియాలోని తీర ప్రాంతాల్లో భారీ డీశాలినేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సముద్రం నుంచి నీటిని తీసుకొచ్చి, అందులోని ఉప్పు, మలినాలను తొలగించి మంచినీటిగా మారుస్తారు. అనంతరం ఈ నీటిని భారీ పైప్‌లైన్ల ద్వారా వందల కిలోమీటర్ల దూరంలోని నగరాలు, జనావాసాలకు తరలిస్తారు. అంటే.. సహజంగా ప్రవహించే నదులు లేకపోయినా, విస్తారమైన ప్రాంతాలకు నీటిని చేరవేసే ఓ 'కృత్రిమ నదీ వ్యవస్థ'ను నిర్మించుకున్నట్టే. మరి సముద్రపు ఉప్పునీరు అసలు తాగునీటిగా ఎలా మారుతుంది? ఎడారి, కొండలు, రాళ్లను దాటుకుంటూ ఈ నీరు వందల కిలోమీటర్లు ఎలా ప్రయాణిస్తుంది? ఇందుకోసం సౌదీ నిర్మించిన భారీ పైప్‌లైన్లు, అత్యాధునిక శుద్ధి వ్యవస్థ ఎలా పనిచేస్తాయన్నది ఆసక్తికరం.

### భారీ పైప్‌లైన్ల నిర్మాణం

ఈ నీటి రవాణాకు ఉపయోగించే పైప్‌లైన్లు సాధారణమైనవి కావు. ఎడారి వేడి, ఇసుక తుపాన్లు, నేలలోని ఒత్తిడిని తట్టుకునేలా హై-స్ట్రెంగ్త్ కార్బన్ స్టీల్‌తో వీటిని తయారు చేస్తారు. దాదాపు 1.8 మీటర్ల వ్యాసంతో ఉండే భారీ పైపులను 12 నుంచి 18 మీటర్ల పొడవైన సెక్షన్లుగా తయారు చేసి, ప్రత్యేక ట్రక్కుల్లో ఎడారి ప్రాంతాలకు తరలిస్తారు. పైపులకు తుప్పు పట్టకుండా ప్రత్యేక కోటింగ్ వేసి, అల్ట్రాసోనిక్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే వినియోగిస్తారు.

### ఇసుక.. రాళ్లు.. కొండలు దాటుతూ

తీర ప్రాంతం నుంచి అంతర్భాగాలకు పైప్‌లైన్ వేయడం మరో భారీ సవాలు. ముందుగా ఉూ, ఆధునిక సర్వే పరికరాలతో మార్గాన్ని నిర్ణయిస్తారు. కదిలే ఇసుక దిబ్బలు, అస్థిరమైన భూభాగాలను వీలైనంత వరకు తప్పించుకుంటారు. రాళ్లు, కొండలు ఎదురైతే నియంత్రిత పేలుళ్లతో వాటిని తొలగించి లోతైన కాలువలు తవ్వుతారు. అందులో పైపులను అమర్చి.. ఒక్కో సెక్షన్‌ను మరొకదానితో అనుసంధానిస్తూ వేల కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను నిర్మించారు.

### అసలు నీరు ఎక్కడి నుంచి?

ఇదంతా ఒక ఎత్తయితే.. అసలు నీటి వనరు సముద్రమే. తీరానికి వందల మీటర్ల దూరంలో భారీ ఇన్‌టేక్ పైపులను ఏర్పాటు చేసి సముద్రపు నీటిని ప్లాంట్లలోకి తీసుకొస్తారు. కొన్ని పైపులు రోజుకు కోట్ల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయి. చేపలు, పీతలు, జెల్లీ ఫిష్ వంటి సముద్ర జీవులు లోపలికి రాకుండా ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేస్తారు.

### ఉప్పునీరు.. మంచినీరుగా ఎలా?

మొదట సముద్రపు నీటిని ఇసుక ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేస్తారు. ఫెరిక్ క్లోరైడ్, సోడియం హైపోక్లోరైట్ వంటి రసాయనాలతో మలినాలను ఒకచోట చేర్చి తొలగిస్తారు. ఆ తర్వాత 1--5 మైక్రాన్ల పరిమాణంలో ఉన్న సూక్ష్మ కణాలను కూడా పట్టుకునే కార్ట్రిడ్జ్ ఫిల్టర్ల ద్వారా నీటిని పంపిస్తారు. అసలు కీలక ప్రక్రియ రివర్స్ ఆస్మోసిస్ . దాదాపు 60 బార్ ఒత్తిడితో సముద్రపు నీటిని ప్రత్యేక మెంబ్రేన్‌ల గుండా పంపుతారు. నీటి అణువులు మాత్రమే మెంబ్రేన్‌ను దాటుతుండగా.. ఉప్పు, ఇతర మలినాలు వెనుకే మిగిలిపోతాయి. అవసరమైతే మరోసారి ఈూ ప్రక్రియ నిర్వహించి మరింత శుద్ధి చేస్తారు.

### శుద్ధి చేశాక మళ్లీ ఖనిజాలే!

అయితే పూర్తిగా శుద్ధి చేసిన నీటిలో సహజంగా ఉండే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో నీటికి అవసరమైన ఖనిజాలను మళ్లీ కలుపుతారు. పీహెచ్ స్థాయిని కూడా సరిచేసి.. తాగేందుకు అనువుగా మారుస్తారు.

### ఖర్చు భారీ.. అవసరం తప్పనిసరి

ఇంత భారీ నీటి వ్యవస్థను నిర్మించడం అంత చౌక కాదు. ఒక్క కిలోమీటర్ పైప్‌లైన్ నిర్మాణానికే మిలియన్ల డాలర్లు ఖర్చవుతాయి. భారీ డీశాలినేషన్ ప్లాంట్లకు వందల మిలియన్ల డాలర్ల పెట్టుబడులు అవసరం. నీటి ఉత్పత్తి ఖర్చు కూడా సాంకేతికత, విద్యుత్ ధరలు, ప్లాంట్ సామర్థ్యాన్ని బట్టి గణనీయంగా ఉంటుంది. అయినా సౌదీకి మరో మార్గం పెద్దగా లేదు. నదులు లేని దేశం.. తక్కువ వర్షపాతం.. విస్తారమైన ఎడారి. అందుకే సముద్రాన్నే నీటి వనరుగా మార్చుకుని.. వందల కిలోమీటర్ల పైప్‌లైన్లతో ఆ నీటిని ఎడారి మధ్యనున్న నగరాలకు చేరుస్తోంది. సహజంగా లేని నదులకు బదులుగా ఇంజినీరింగ్‌తో కృత్రిమ జలధారను సృష్టించుకుంది.

# ట్రంప్ వార్నింగ్.. ఇరాన్‌కు కటీఫ్ చెప్పాల్సిందేనా?

ఇరాన్‌పై అమెరికా ఆంక్షల ఉచ్చు మరింత బిగుస్తోంది. ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలు వెంటనే వాటిని తగ్గించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇరాన్‌ను ఆర్థికంగా ఒంటరిని చేసి.. చివరకు అమెరికాతో చర్చలు, ఒప్పందానికి దిగేలా ఒత్తిడి చేయడమే వాషింగ్టన్ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే ఈ హెచ్చరికలకు ఇరాన్ ప్రధాన భాగస్వాములైన చైనా, రష్యా ఎంతవరకు తలొగ్గుతాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. అదే సమయంలో ఈ పరిణామం భారత్‌కు మాత్రం కొత్త చిక్కును తెచ్చిపెట్టింది. ఒకవైపు అమెరికాతో వేగంగా బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం.. మరోవైపు ఇరాన్‌తో భారత్‌కు ఉన్న చారిత్రక, వాణిజ్య, వ్యూహాత్మక బంధం. ఈ రెండింటినీ సమతుల్యం చేయడం ఢిల్లీకి సవాల్‌గా మారింది. ముఖ్యంగా ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలపై సెకండరీ ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న హెచ్చరిక నేపథ్యంలో.. భారత్ ఎంతవరకు అమెరికా ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుంటుందన్నదే ఆసక్తికరంగా మారింది. అయితే ఇది భారత్‌కు పూర్తిగా కొత్త పరిస్థితి కాదు.

### రష్యా విషయంలో వెనక్కి తగ్గని ఢిల్లీ

ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత రష్యాపై అమెరికా, పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ.. భారత్ మాస్కోతో సంబంధాలను పూర్తిగా తెంచుకోలేదు. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని రష్యా నుంచి భారీగా క్రూడ్ కొనుగోళ్లను కొనసాగించింది. 2026 జూన్‌లో రష్యా చమురు భారత్ మొత్తం క్రూడ్ దిగుమతుల్లో సగానికి పైగా వాటా సాధించినట్లు రాయిటర్స్ డేటా పేర్కొంది. అంటే అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ కొనసాగించింది. అయితే ఇరాన్ విషయంలో సమీకరణాలు కొంత భిన్నంగా ఉన్నాయి.

### ఇప్పటికే భారీగా తగ్గిన వాణిజ్యం

భారత్--ఇరాన్ ద్వైపాక్షిక వాణిజ్యం గతంతో పోలిస్తే భారీగా క్షీణించింది. 2018--19లో దాదాపు 17 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యం.. 2025--26లో సుమారు 1.6 బిలియన్ డాలర్లకు పడిపోయింది. భారత్ ప్రధానంగా ఇరాన్‌కు బియ్యం, టీ, ఔషధాలు




తదితర వస్తువులను ఎగుమతి చేస్తోంది. అమెరికా ఆంక్షలు మరింత కఠినతరం కావడం, యూఏఈ వంటి మార్గాల ద్వారా చెల్లింపులు, రీ-ఎగుమతులపై ఆంక్షల ప్రభావం పెరగడం భారత ఎగుమతిదారులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా బాస్మతి, టీ, ఫార్మా రంగాలపై ప్రభావం పడొచ్చు. అయితే ఇరాన్‌తో వాణిజ్యం ఇప్పటికే పరిమిత స్థాయికి చేరినందున.. భారత్ మొత్తంగా ఎదుర్కొనే ఆర్థిక దెబ్బ కంటే, కొన్ని రంగాల్లోని ఎగుమతిదారులపై ప్రభావమే ఎక్కువగా ఉండొచ్చు.

### చమురు కంటే పెద్ద ముప్పు.. హర్మూజ్

భారత్‌కు ఇరాన్ విషయంలో అసలు ఆందోళన కేవలం ఆ దేశం నుంచి ఎంత చమురు కొనుగోలు చేస్తున్నామన్నది కాదు.. హర్మూజ్ జలసంధి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఉద్రిక్తత పెరిగితే అంతర్జాతీయ చమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంది. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌లో దీనివల్ల దిగుమతి బిల్లు పెరగడంతో పాటు రూపాయి, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరగొచ్చు. అయితే తాజా అమెరికా ఆంక్షల ప్రకటన తర్వాత వెంటనే చమురు ధరలు పెరగలేదు. ఆంక్షలు ఇరాన్‌పై ఒత్తిడిని పెంచి, చివరకు దౌత్యపరమైన పరిష్కారానికి దారితీయవచ్చన్న అంచనాలు కూడా మార్కెట్లలో కనిపించాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర 2.35 శాతం తగ్గి 92.17 డాలర్ల వద్ద ముగిసింది.

### చాబహార్‌ను వదులుకోవడం అంత సులభమా?

ఇరాన్‌తో భారత్ సంబంధాల్లో చాబహార్ పోర్టు మరో కీలక అంశం. పాకిస్థాన్‌ను దాటకుండా అఫ్గానిస్థాన్, మధ్య ఆసియాకు చేరుకునే మార్గంగా ఇది భారత్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో చాబహార్‌లో భారత కార్యకలాపాలు కొనసాగించడం సవాల్‌గా మారుతున్నప్పటికీ.. ఇరాన్‌తో పూర్తిగా సంబంధాలు తెంచుకుంటే ఈ కీలక కనెక్టివిటీ మార్గంపై భారత్ తన ప్రభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ఇరాన్ భారత్‌కు కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు.. పశ్చిమాసియాలో వ్యూహాత్మక భాగస్వామి కూడా.

### మరి మోదీ సర్కార్ ఏం చేస్తుంది?

ప్రస్తుతానికి భారత్‌పై అమెరికా నేరుగా ఆంక్షలు విధించలేదు. తాజా చర్యల్లో భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న నిర్ణయం కూడా కనిపించలేదు. దీంతో ఢిల్లీకి ఇంకా కొంత దౌత్యపరమైన వెసులుబాటు ఉంది. అమెరికాతో సంబంధాలను దెబ్బతీయకుండా.. అదే సమయంలో ఇరాన్‌తో అవసరమైన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవడం భారత్ ముందున్న వాస్తవిక మార్గంగా కనిపిస్తోంది. రష్యా విషయంలో అనుసరించినట్టుగా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆంక్షల పరిధిలోకి వెళ్లకుండా సంబంధాలను పరిమిత స్థాయిలో కొనసాగించే ప్రయత్నం చేయొచ్చు.

### కటీఫ్ కాదు.. కత్తిమీద సాము!

కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో "ఇరాన్‌కు భారత్ కటీఫ్ చెబుతుంది" అనుకోవడం తొందరపాటు అంచనా. అదే సమయంలో అమెరికా హెచ్చరికలను పూర్తిగా విస్మరించి ఇరాన్‌తో యథావిధిగా ఆర్థిక సంబంధాలు కొనసాగించడం కూడా ఢిల్లీకి అంత సులభం కాదు. వాణిజ్యం ఇప్పటికే గణనీయంగా తగ్గిపోయింది. చమురు విషయంలో భారత్‌కు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలున్నాయి. కానీ చాబహార్, మధ్య ఆసియా కనెక్టివిటీ, పశ్చిమాసియాలో వ్యూహాత్మక ప్రయోజనాలు, హర్మూజ్ భద్రత వంటి అంశాలను ఒక్కసారిగా పక్కన పెట్టడం సాధ్యం కాదు. అందుకే భారత్ ముందున్న మార్గం 'ఇరాన్‌కు కటీఫ్' కంటే.. 'అమెరికా ఆంక్షలకు చిక్కకుండా ఇరాన్‌తో అవసరమైన సంబంధాలను కొనసాగించడం' అయ్యే అవకాశమే ఎక్కువ. రష్యా విషయంలో అమెరికా ఒత్తిడిని తట్టుకుని జాతీయ ప్రయోజనాలను కాపాడుకున్న భారత్.. ఇప్పుడు ఇరాన్ విషయంలోనూ అదే వ్యూహాన్ని అనుసరిస్తుందా? లేక అమెరికాతో పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ప్రాధాన్యం ఇస్తుందా? ఈ సమతుల్యమే మోదీ సర్కార్‌కు అసలు పరీక్ష.

# హీరోలకు ఒక రూల్.. హీరోయిన్లకు మరో రూల్ ఎందుకు?

హీరోలకు ఒక రూల్.. హీరోయిన్లకు మరో రూల్ ఎందుకు? సినీ ఇండస్ట్రీలో ఫ్లాప్ అనేది కొత్త విషయం కాదు. భారీ అంచనాలతో వచ్చిన స్టార్ హీరోల సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన సందర్భాలెన్నో ఉన్నాయి. అయితే ఒక స్టార్ హీరో సినిమా ఫ్లాప్ అయినంత మాత్రాన వారి



తర్వాతి భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ ఆగిపోవడం అరుదు. ప్రొడ్యూసర్లు, ఇన్వెస్టర్లు వెంటనే వెనక్కి తగ్గరు. స్టార్ పవర్, మార్కెట్, గత సక్సెస్‌లను పరిగణనలోకి తీసుకుని మరోసారి భారీగా పెట్టుబడి పెట్టడానికి రెడీ అవుతారు. కానీ ఇదే పరిస్థితి హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల విషయంలో ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్న ఇప్పుడు మరోసారి డిస్కషన్‌కు వస్తోంది. ఒక ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్, ముఖ్యంగా భారీ స్థాయిలో తెరకెక్కిన సినిమా బాక్సాఫీస్ వద్ద ఫెయిలైతే దాని ఇంపాక్ట్ కేవలం ఆ ఒక్క సినిమాకే పరిమితం కావడం లేదనే వాదన ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఆ ఫ్లాప్‌ను ఒక వ్యక్తిగత సినిమా వైఫల్యంగా చూడకుండా, మొత్తం లేడీ ఓరియెంటెడ్ సినిమాల మార్కెట్‌కు సంబంధించిన హెచ్చరికగా ఇన్వెస్టర్లు భావిస్తున్నారన్న విషయాన్ని రీసెంట్ గా హీరోయిన్ తాప్సీ పన్ను తెలిపారు. ఒక హీరో నటించిన భారీ యాక్షన్ సినిమా ఫ్లాప్ అయితే కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్టర్ లేదా టైమింగ్ వంటి అనేక కారణాలను విశ్లేషిస్తారు. కానీ ఒక హీరోయిన్ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీ ఫెయిలైతే మాత్రం వెంటనే లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీస్‌కు మార్కెట్ లేదనే డెసిషన్ కు రావడం ఎంతవరకు సమంజసమని దీనిపై పెద్ద డిస్కషన్ జరుగుతోంది రీసెంట్ గా బాలీవుడ్ లో ఆలియా భట్ నటించిన లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీ ఆల్ఫా ఆశించిన రిజల్ట్ అందుకోకపోవడంతో ఈ డిస్కషన్ మరింత బలపడింది.



అసలు ఒక సినిమా ఫ్లాప్ కావడం వల్ల ఆ జానర్‌పైనే నమ్మకం ఎందుకు తగ్గాలి? హీరోలతో వచ్చిన యాక్షన్ సినిమాలు వరుసగా ఫ్లాపైనా యాక్షన్ జానర్‌ను ఎవరూ పూర్తిగా పక్కన పెట్టరు. కానీ హీరోయిన్ తో చేసిన ఒక భారీ ప్రయత్నం విఫలమైతే మాత్రం ఆ తరహా ప్రాజెక్టులపై సందేహాలు మొదలవుతాయి. ఇక్కడ సమస్య కేవలం ఒక సినిమా ఫ్లాప్ కాదు. ఆ ఫ్లాప్ తర్వాత మార్కెట్ ఎలా రియాక్ట్ అవుతుందన్నదే అసలు విషయం.

# చిరు కూతురు ‘అమ్ములు’గా అనశ్వర..‘




## కాకా’ నుంచి ఫస్ట్ లుక్ విడుదల




**మెగాస్టార్ ‘కాకా’ నుంచి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ విడుదల**

**చిరంజీవి కూతురు ‘అమ్ములు’ పాత్రలో నటిస్తున్న అనస్వర**

**ఆమె పుట్టినరోజు సందర్భంగా పోస్టర్ రిలీజ్ చేసిన చిత్రబృందం**

**తండ్రీకూతుళ్ల అనుబంధం ప్రధానంగా సాగనున్న ఈ సినిమా**

**2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న మూవీ రిలీజ్**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం ‘కాకా’ నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా ‘అమ్ములు’ పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, ‘ఛాంపియన్’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.

# ట్రెండ్ ను ఫాలో అవుతున్న బాలయ్య.. 80స్ లుక్ లో దాదా!

ట్రెండ్ ను ఫాలో అవుతున్న బాలయ్య.. 80స్ లుక్ లో దాదా! సోషల్ మీడియా ప్రపంచాన్ని ప్రస్తుతం ఒక సరికొత్త నాస్టాల్జిక్ ట్రెండ్ ఊపేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ తెరిస్తే చాలు, సరిగ్గా నలభై ఏళ్ల కిందటి వైబ్ గుర్తుచేసేలా అచ్చం 1980ల నాటి వింటేజ్ చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. ‘1980ం ూా× ూ్రష్రశీ ుతీవఅం’ పేరుతో వైరల్ అవుతున్న ఈ క్రేజ్‌ను మన గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ‘దాదా’ (ణూణూ) పిక్స్ మరింత హీటెక్కించాయి. బాలయ్య వింటేజ్ గ్యాంగ్‌స్టర్ లుక్స్ ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.ఆ విశేషాలు చూద్దాం.. ఊచకోతలో ఓ ట్విస్ట్ సోషల్ మీడియాను





ఊపేస్తున్న ఏఐ ట్రెండ్: ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) మ్యాజిక్‌తో పాతకాలపు జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందుకు వస్తున్నాయి. చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ సాయంతో ఎలాంటి ప్రత్యేక నైపుణ్యం లేకుండానే తమ ఫోటోలను 80ల నాటి క్లాసిక్ రెట్రో లుక్‌లోకి మార్చేస్తున్నారు నెటిజన్లు. కేవలం ఒక ప్రాంప్ట్ ఇచ్చి క్షణాల్లో పాత సినిమాల హీరోల రేంజ్ వింటేజ్ ఫోటోలను తయారుచేసుకుని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ లైకుల వర్షం కురిపిస్తున్నారు. ‘దాదా’ లుక్‌తో బాలయ్య విధ్వంసం: గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న భారీ చిత్రం ‘దాదా’ టైటిల్ గ్లింప్స్ విడుదలైనప్పటి నుంచి ఈ ట్రెండ్ మరింత ఊపందుకుంది.ఇక ఈ సినిమాలో బాలయ్య 1980ల ముంబై బ్యాక్‌డ్రాప్‌లో, నోట్లో సిగార్, చేతిలో తుపాకీతో ‘కింగ్ ఆఫ్ ఖోస్’ గా కనిపించనున్నారు. ఇక ఈ సినిమా బ్యాక్‌డ్రాప్‌కు తగ్గట్లే ఫ్యాన్స్ ఏఐ సాయంతో బాలయ్య కొత్త ఫోటోలను వింటేజ్ గ్యాంగ్‌స్టర్ వైబ్‌లోకి మార్చి సోషల్ మీడియాలో వదులుతున్నారు. నెట్టింట వైరల్ అవుతున్న ఏఐ పిక్స్‌లో బాలయ్య లుక్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. 80ల నాటి ఆఫ్-వైట్ సూట్ బ్లేజర్, వైడ్-లేబుల్ బ్రౌన్ షర్ట్, మెడలో బంగారు గొలుసు, ఈగల్ బకిల్ బెల్ట్ ధరించి కనిపించారు. అంతేకాకుండా పాతకాలపు అంబాసిడర్ కార్ ముందుకు అనుకుని నిలబడిన ఈ పిక్స్ చూసి నందమూరి అభిమానులు ఫిదా అయిపోతున్నారు. నిజమైన సినిమా స్టిల్స్ లాగే ఉన్నాయంటూ కామెంట్లు పెడుతున్నారు. మొత్తానికి సాంకేతికత అందించిన ఈ ఏఐ ట్రెండ్‌ను సినీ ప్రియులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. అందులోనూ బాలకృష్ణ మాస్ పవర్, గోపీచంద్ మలినేని మార్క్ వింటేజ్ యాక్షన్ ఎలిమెంట్స్ కలగలసి రాబోతున్న ‘దాదా’ సినిమాపై ఈ ఏఐ పిక్స్ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక 80ల నాటి ముంబై అండర్‌వరల్డ్ కథతో రాబోతున్న బాలయ్య బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టిస్తారో చూడాలి..

# ట్రెడిషనల్ లుక్‌లో అవికా గోర్.. రాయల్ అవతార్‌లో ఫ్యాన్స్ ఫిదా!



ట్రెడిషనల్ లుక్‌లో అవికా గోర్.. రాయల్ అవతార్‌లో ఫ్యాన్స్ ఫిదా! బుల్లితెర చిన్నారి ఆనందిగా అందరి హృదయాలను దోచుకుని, ఆ తర్వాత టాలీవుడ్‌లో వరుస హిట్లతో స్టార్ హీరోయిన్‌గా మారిన అవికా గోర్ తాజాగా చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. రాయల్ ట్రెడిషనల్ లుక్‌లో రాజకుమారిలా మెరిసిపోతున్న ఆమె ఫోటోలు ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సాంప్రదాయ దుస్తుల్లో మోడ్రన్ టచ్ ఇస్తూ ఆమె ఇచ్చిన పోజులకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఈ క్లాసీ అవతార్ పిక్స్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతున్నాయి.



రాయల్ బ్రౌన్ వెల్వెట్ లెహంగాలో మెరుపులు: ఈ ప్రత్యేకమైన ఫోటోషూట్ కోసం అవికా గోర్ బ్రౌన్ కలర్ వెల్వెట్ లెహంగాను ఎంచుకున్నారు. దానికి మ్యాచింగ్‌గా బంగారు మరియు మల్టీ కలర్ వర్క్‌తో డిజైన్ చేసిన హెవీ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ధరించారు. ఇక రాయల్ హెరిటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ ఫోటోలలో ఆమె ఎంతో రాజసంగా, కంటి రెప్ప వేయకుండా చూసేంత అందంగా కనిపిస్తోంది. స్టైలింగ్, జ్యువెలరీకి నెటిజన్ల ప్రశంసలు: అవికా ధరించిన రాయల్ జ్యువెలరీ, హెయిర్ అప్‌డో, మరియు ముఖంలో ఉన్న ప్రశాంతమైన హావభావాలు ఆమెకు క్లాసిక్ ఎలిగాన్స్‌ను తెచ్చిపెట్టాయి. ఈ రాయల్ అవతార్‌ను డిజైన్ చేసిన స్టైలిస్ట్ నిధి మునోత్ తో పాటు మేకప్, ఫొటోగ్రఫీ టీమ్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్‌లా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు.

చిన్నారి ఆనంది నుంచి స్టార్ హీరోయిన్ వరకు: ‘చిన్నారి పెళ్లికూతురు’ సీరియల్‌తో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన అవికా, ‘ఉయ్యాల జంపాల’ చిత్రంతో తెలుగు సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది. ఇక మొదటి సినిమాతోనే బెస్ట్ డెబ్యూ హీరోయిన్‌గా సైమా అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత ‘సినిమా చూపిస్త మావ’, ‘ఎక్కడికి పోతావు చిన్నవాడా’, ‘రాజు గారి గది 3’ వంటి వరుస హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. కంటెంట్ ఉన్న సినిమాలకే మొగ్గు: హిందీలో ‘1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్’, ‘బ్లడీ ఇష్క్’ వంటి చిత్రాలతో పాటు ‘పాప్‌కార్న్’ అనే సినిమాకు సహ నిర్మాతగా వ్యవహరించి తన టాలెంట్ చూపించింది. ఇక 2025లో వచ్చిన ‘షణ్ముఖ’ సినిమాతో అలరించిన ఆమె, 2026లో ‘అగ్లీ స్టోరీ’ అనే సరికొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమాలతో పాటు రియాలిటీ షోస్ చేస్తూ నిరంతరం ట్రెండింగ్‌లో ఉంటోంది.

# హీరోలకు ధీటుగా విలన్ పాత్రలు: మారిన ట్రెండ్!

మారిన ట్రెండ్! ఒకప్పుడు భారతీయ సినిమాలో విలన్ అంటే హీరో చేతిలో దెబ్బలు తినడానికి.. చివర్లో అంతమవ్వడానికి మాత్రమే పరిమితమయ్యే పాత్ర. కానీ ఇప్పటి ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. కథలో విలన్ ఎంత శక్తివంతంగా ఉంటే? ఆ విలన్‌ను ఢీకొట్టే హీరో పాత్ర అంతగా ఎలివేట్ అవుతుందనే సూత్రాన్ని నేటి దర్శకులు బలంగా నమ్ముతున్నారు. హీరో పాత్రకు ఏమాత్రం తీసిపోని రీతిలో.. సవాలు విసిరే విధంగా విలన్ పాత్రలకు ప్రాణం పోస్తుండటంతో ఇండియన్ సినిమాలో సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఈ క్రమంలోనే నేచురల్ స్టార్ నాని నటిస్తోన్న భారీ చిత్రం




-పారడైజ్- పై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నానికి పోటీగా ప్రతికూల ఛాయలున్న పవర్ ఫుల్ విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు రాఘవ్ జూయల్ విక్రమ్ మాలిక్ అనే పాత్రలో నటిస్తున్నారు. సాధారణంగా విలన్ పాత్రలలో కనిపించని రాఘవ్ ఈ చిత్రంలో ఎంతటి క్రూరమైన నటనకు ప్రాధాన్యమున్న పాత్ర పోషిస్తున్నారో మేకర్స్ ఇస్తున్న లీక్స్ ను బట్టే తెలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ ఉన్న దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఎప్పుడూ విలన్ పాత్రలను పవర్ ఫుల్‌గా తీర్చిదిద్దుతారని పేరుంది. ఆయన తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం -వారణాసి-లో మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభా అనే ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నారు. హీరోకు తగ్గట్లే సమానమైన బలంతో, ఆధిపత్యం ప్రదర్శించే పాత్రగా కుంభా క్యారెక్టర్ రూపుదిద్దుకుంటోంది. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ మూవీ -సలార్ 2-లోనూ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కొనసాగుతున్నారు. ప్రభాస్ పాత్రకు సరిసమానమైన స్క్రీన్ ప్రెజెన్స్, ఫ్రెండ్‌షిప్ నుంచి శత్రుత్వంలోకి మారే క్రమంలో ఉండే భావోద్వేగాలను పృథ్వీరాజ్ పవర్‌ఫుల్ నటనతో పండించబోతున్నారు. ఇంకా -కల్కి 2- లో లోకనాయకుడు కమల్ హాసన్ యాస్కిన్ పాత్రలో పూర్తిస్థాయి విశ్వరూపం చూపించనున్నారు. ఈ పాత్ర గనుక పండితే? కమల్ ఇమేజ్ కొత్త కోణంలో హైలైట్ అవుతుంది ఇలా సౌత్ స్టార్లనే విలన్లుగా చూపించడం సినిమా స్థాయిని మరింత పెంచుతోంది. ఈ ట్రెండ్ వల్ల వేర్వేరు భాషలకు చెందిన స్టార్ నటులు ఒకే వేదికపైకి రావడం సాధ్యమవుతోంది. ఇది సినిమా బాక్సాఫీస్ మార్కెట్‌ను పెంచడమే కాకుండా ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని ఇస్తోంది. విలన్ పాత్రలు భయాన్ని కలిగించడమే కాకుండా వారి నటనతో ప్రేక్షకులను మెప్పించి కథను నడిపించే శక్తులుగా మారుతున్నాయి. అంతిమంగా ఇండియన్ సినిమాలో హీరో-విలన్ల మధ్య పోరు కొట్లాటలకు పరిమితం కాలేదు. మైండ్ గేమ్‌లు - నటనతో పోటీపడే స్థాయికి చేరింది. విలనిజానికి లభిస్తున్న ప్రాధాన్యత భవిష్యత్ లో మరిన్ని వైవిధ్యమైన కథలు, పాత్రలు వెండితెరకు రావడానికి మార్గం సుగమం చేస్తోందని చెప్పొచ్చు.

## 75 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్ ఐకాన్..
# మమ్ముట్టి యంగ్ లుక్ సీక్రెట్ ఇదే!



**జిమ్‌లో వర్కౌట్లు, సరైన నిద్రకు అధిక ప్రాధాన్యం**

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సెప్టెంబర్ 7న 75వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్, యంగ్ లుక్ చూసి సినీ పరిశ్రమ, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. కండరాల బలం, శారీరక చురుకుదనం సహజంగా తగ్గే వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటం వెనుక ఒక క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, క్రమం తప్పని వ్యాయామం, సరైన నిద్ర వంటి అలవాట్లే ఆయన ఫిట్‌నెస్ రహస్యాలుగా తెలుస్తోంది.



**సూర్యకు స్ఫూర్తినిచ్చిన మమ్ముట్టి**

తమిళ స్టార్ హీరో సూర్య సైతం మమ్ముట్టి ఆహారపు అలవాట్ల నుంచి స్ఫూర్తి పొందినట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. “ఇష్టమైనది ఏదైనా తినొచ్చు, కానీ ఇష్టమొచ్చినంత తినకూడదు, కడుపు సగం నిండే వరకే తినాలి” అని మమ్ముట్టి తనకు సలహా ఇచ్చినట్లు సూర్య గుర్తుచేసుకున్నారు. పూర్తిగా మానేయడం కంటే, పరిమితంగా తినడమే మమ్ముట్టి డైట్‌లో కీలక సూత్రం.

**డైట్ ప్లాన్ ఎలా ఉంటుంది?**

కొన్ని నివేదికల ప్రకారం, మమ్ముట్టి నూనెలో వేయించిన పదార్థాలకు, చక్కెర, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉంటారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు, నట్స్ వంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం అల్పాహారంలో ఓట్స్ జావ, గుడ్డులోని తెల్లసొన, బొప్పాయి, నానబెట్టిన బాదం వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం అన్నానికి బదులుగా ఓట్స్ పుట్టుతో పాటు తక్కువ మసాలాతో వండిన చేపల కూర తింటారు. రాత్రిపూట గోధుమ లేదా ఓట్స్ దోశలతో చికెన్ లేదా చేపల కూర తీసుకుని, తేలికపాటి ఆహారంతో సరిపెడతారు. ఆయన వ్యక్తిగత చెఫ్ చెప్పిన ప్రకారం, వేయించిన చేపల కంటే చేపల పులుసునే ఆయన ఇష్టపడతారు.

**వ్యాయామం, నిద్రకు అధిక ప్రాధాన్యం**

ఆహార నియమాలతో పాటు, మమ్ముట్టి రోజూ జిమ్‌లో వర్కౌట్లు చేస్తారు. వయసు పెరిగేకొద్దీ కండరాల బలం తగ్గకుండా ఉండేందుకు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో వ్యాయామాలు చేస్తుంటారు. ఫిట్‌నెస్ విషయంలో వ్యాయామం ఎంత ముఖ్యమో, శరీరానికి సరైన విశ్రాంతి కూడా అంతే అవసరమని ఆయన నమ్ముతారు. అందుకే, షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నా, సరైన సమయానికి నిద్రపోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. మమ్ముట్టి 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం ‘మేళా’ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఒకవైపు నటుడిగా రాణిస్తూనే, మరోవైపు ఆరోగ్యకరమైన జీవనశైలితో ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.